దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747

వార్తాప్రభ
RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 208 | ది. 24-10-2025 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 208 | Date : 24-10-2025 | Friday | Pages : 8 | Rs.1/- |

## తిరువూరు వ్యవహారంపై చంద్రబాబు సీరియస్



**తిరువూరు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని చిన్ని వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు తీవ్రంగా పరిగణించారు. సోషల్ మీడియాలో రచ్చపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ విమర్శలు, వివాదాలు సృష్టించే వ్యాఖ్యలపై సీరియస్ అయ్యారు. దుబాయ్ పర్యటనలో ఉన్న సీఎం.. ఏపీ తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో మాట్లాడారు. ఇద్దరినీ పిలిచి మాట్లాడతానని పల్లా చెప్పగా.. అవసరం లేదని యూఏఈ నుంచి వచ్చాక తానే దృష్టి పెడతానని స్పష్టం చేసినట్లు సమాచారం.

# పెట్రో కెమికల్ రంగంలో ఏపీలో అపార అవకాశాలు

- దక్షిణాసియాకు చేరువలో వ్యూహాత్మక ప్రాంతంగా ఏపీ
- అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు
- ఏపీలో పెట్టుబడులు పెట్టాలని టెక్ కంపెనీలకు ఆహ్వానం
- రెండో రోజు పర్యటనలో అబుదాబి పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ



**దక్షిణాసియాకు చేరువగా సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్... ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అత్యంత అనుకూలమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ రంగంలో పెట్టుబడులకు ఏపీలో విస్తృతంగా అవకాశాలు ఉన్నాయని అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులకు వివరించారు.**

**అబుదాబి,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** యూఏఈ పర్యటనలో భాగంగా రెండో రోజు గురువారం అబుదాబీలో అల్ మైరాహ్ ఐలాండ్‌లోని ఏడీజీఎ స్క్వేర్‌లో ఏడీఎన్ఓసీ గ్లోబల్ ట్రేడింగ్ ప్రతినిధి అహ్మద్ బిన్ తలిత్‌తో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పెట్రోకెమికల్, ఇంధన, ఎల్ఎన్‌జీ, గ్యాస్ ప్రాసెసింగ్, పోర్ట్ లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అవకాశాలు గురించి చర్చించారు. కృష్ణపట్నం, మచిలీపట్నం, రామాయపట్నం, కాకినాడ వంటి పోర్టుల సమీపంలో పెట్రో కెమికల్, ఎనర్జీ రంగాల పెట్టుబడులకు అనువుగా ఉంటాయని సీఎం అన్నారు. ఏడీఎన్ఓసీ–ఆంధ్రప్రదేశ్ మధ్య సాంకేతిక సహకారం పైనా స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని భేటీలో ఇరువురు నిర్ణయించారు.

**అబుదాబీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్‌తోనూ భేటీ..** అబుదాబీ చాంబర్ చైర్మన్ అహ్మద్ జాసిమ్ అల్ జాబీతో, జీ 42 సీఈఓ మాన్సూర్ అల్ మాన్సూరీతోనూ ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ పయనిస్తోందని, రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి వస్తున్నాయని సీఎం తెలిపారు. కొత్త అవకాశాలకు, ఇన్నోవేషన్‌కు అమరావతి కేంద్రంగా ఉంటుందన్నారు. విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని ఈ సందర్భంగా వారిని సీఎం



ఆహ్వానించారు. కృత్రిమ మేధస్సు, క్లౌడ్ కంప్యూటింగ్, హెల్త్‌టెక్ రంగాల్లో నూతన ఆవిష్కరణలపై పనిచేస్తున్న జీ 42 ఇంటర్నేషనల్ సంస్థను ఏఐ డేటా సెంటర్లు, ఇన్నోవేషన్ ల్యాబ్స్, స్మార్ట్ గవర్నెన్స్ టెక్నాలజీని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు స్వాగతించారు.

**టెక్ కంపెనీ ప్రతినిధులతో నెట్వర్క్ లంచ్..** అనంతరం అబుదాబీలోని పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం నెట్వర్క్ లంచ్ సమావేశంలో పాల్గొంది. దీనిలో జీ 42 సీఈవో మనుకుమార్ జైన్, ఏడీఐసీ గ్లోబల్ హెడ్ లలిత్ అగర్వాల్, ఐహెచ్‌సీ సీఈవో అజయ్ భాటియా, డబ్ల్యుఐవో బ్యాంక్ సీఈవో జయేష్ పాటిల్, పాలిగాన్ మార్ఫిక్ సీఈవో జయంతి కనాని, ట్రక్కర్ సీఈవో గౌరవ్ బిశ్వాస్, పాలసీ బజార్ గ్రూప్ సీఈవో యశిష్ దహియా, ఇన్సూరెన్స్ మార్కెట్ సీఈవో అవినాష్, ఇన్సార్ట్స్ సీఈవో అజార్ ఇక్బాల్, జీఐఐ సీఈవో పంకజ్ గుప్తా, నూన్ సీఈవో ఫరాజ్ ఖలీద్, ఇన్సెప్షన్ సీఈవో ఆశీష్ కోషి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశానికి టెక్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే లక్ష్యాన్ని వారికి వివరించారు. రాష్ట్రంలో డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–మెషిన్ లెర్నింగ్, ఫిన్ టెక్, హెల్త్ టెక్, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను సూచించారు. త్వరలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఏపీలో ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. యూఏఈలో టెక్నాలజీ ఆధారిత కంపెనీలతో సంయుక్త వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసి ఏపీలో భవిష్యత్ ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్‌తో పాటు పరిశ్రమలశాఖ, ఈడీబీకి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి

- రాష్ట్రంలో కోకో ఉత్పత్తి బాగుంది...చాక్లెట్ పరిశ్రమ స్థాపించండి
- అబుదాబి పారిశ్రామిక వేత్తలతో వరుస భేటీల్లో సీఎం చంద్రబాబు






**అబుదాబి, అక్టోబరు 23 (వార్తాప్రభ) :** యూఏఈలోని రెండోరోజు పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు అబుదాబిలోని వివిధ పారిశ్రామికవేత్తలతో వన్ టూ వన్ సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఏయే ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయనే అంశాలను పారిశ్రామికవేత్తలకు వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఎనర్జీ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. అపెక్స్ ఇన్వెస్ట్మెంట్స్, మస్దార్, అగ్తియా గ్రూప్, లులు గ్రూప్ వంటి సంస్థలకు చెందిన ప్రతినిధులతో సీఎం చంద్రబాబు విడివిడిగా భేటీ అయ్యారు. ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టాలని అపెక్స్ ఇన్వెస్టిమెంట్ ఛైర్మన్ ఖలీఫా ఖౌరీ, మస్దార్ సీఈఓ మొహమ్మద్ జమీల్ అల్ రమాహీని ముఖ్యమంత్రి కోరారు. విశాఖలో అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ వస్తున్న నేపథ్యంలో గ్రీన్ ఎనర్జీపై ఫోకస్ పెట్టామని అపెక్స్, మస్దార్ సంస్థల ప్రతినిధులకు సీఎం వివరించారు. ఈ క్రమంలో బ్యాటరీ స్టోరేజ్ రంగంలో పెట్టుబడులపై అపెక్స్ ప్రతినిధులు చర్చించారు. సూపర్ కెపాసిటర్స్ రంగంలో పేరొందిన అపెక్స్ సంస్థను ఆ రంగంలో పెట్టుబడులు పెట్టాలని సీఎం ఆహ్వానించారు. ఈ మేరకు సూపర్ కెపాసిటర్ ఉత్పత్తులను రాష్ట్రానికి పంపాలని అపెక్స్ ప్రతినిధులను సీఎం కోరిన మీదట...సూపర్ కెపాసిటర్ ప్రొడెక్ట్సును పంపేందుకు అపెక్స్ ప్రతినిధులు అంగీకరించారు. ఇక ఆతిథ్య రంగంలోనూ పెట్టుబడులు పెట్టాలని ఎపెక్స్ సంస్థను సీఎం ఆహ్వానించారు. సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని మస్దార్ సీఈఓను చంద్రబాబు ఆహ్వానించారు. ఇక అగ్తియా గ్రూప్ సీఈఓతో సల్మీన్ అలమేరీ, లులు గ్రూప్ ఛైర్మన్ యూసఫ్ అలీతో జరిపిన వేర్వేరు భేటీల్లో ఫుడ్ ప్రాసెస్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆ రెండు సంస్థలను సీఎం ఆహ్వానించారు. ఏపీలో కోకో ఉత్పత్తి బాగుంటుందని... తమ దగ్గర చాక్లెట్ పరిశ్రమ పెట్టే అంశంపై ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి అగ్తియా గ్రూప్ కు సూచించారు. అలాగే గల్ఫ్ దేశాల నుంచి పారిశ్రామిక వేత్తలను తీసుకుని విశాఖ పెట్టుబడుల సదస్సుకు రావాలని సీఎం ఆహ్వానించారు.

# ఏపీలో భారీవర్షాలపై దుబాయ్ నుంచి సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

- అప్రమత్తంగా ఉండాలని యంత్రాంగానికి ఆదేశాలు
- ప్రభావిత జిల్లాలకు అత్యవసర నిధులు మంజూరు



**అమరావతి,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై దుబాయ్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షప్రభావిత జిల్లాలు నెల్లూరు, ప్రకాశం, కడప, తిరుపతి, అన్నమయ్య తదితర జిల్లాల పరిస్థితిపై మంత్రులు, సీఎస్, కలెక్టర్లు, ఆర్టీజీఎస్ అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాల్లో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీవర్షాల కారణంగా తీవ్రంగా ప్రభావితం అయిన నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున, మిగతా వర్ష ప్రభావిత జిల్లాలకు రూ.1 కోటి చొప్పున అత్యవసర నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కడప, నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాలకు ఎస్డీఆర్ బృందాలను, నెల్లూరు జిల్లాలో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను తక్షణం మొహరించాలని ముఖ్యమంత్రి సూచనలిచ్చారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ, డిజాస్టర్, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, రహదారులు, భవనాలు, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలనీ ముఖ్యమంత్రి సూచించారు. భారీ వర్షాలతో నీట మునిగిన లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆహారం, పిల్లలకు పాలు లాంటి ఆహారపదార్థాలను అందుబాటులో ఉంచాలన్నారు. దక్షణ కోస్తా, రాయలసీమ జిల్లాలలో ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. తీవ్ర వర్షాల కారణంగా కాలువ, చెరువు గట్లకు గండ్లు పడకుండా బలహీనంగా ఉన్న చోట్ల పటిష్ట పరచాలని సీఎం అధికారులకు సూచనలు ఇచ్చారు. అంటువ్యాధులు వ్యాపించకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే పంట నష్టం జరక్కుండా చూడాలని సీఎం సూచనలిచ్చారు. ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహాలతో చెరువులు నింపేందుకు చర్యలు చేపట్టాలని సీఎం పేర్కొన్నారు.

## సీబీఐకి షాకిచ్చిన జగన్..!

### సెల్ ఫోన్ కేసులో బిగ్ ట్విస్ట్..!






**హైదరాబాద్ ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** అక్రమాస్తుల కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ తాజాగా విదేశీ పర్యటనకు వెళ్లేందుకు బెయిల్ నిబంధనల సడలింపు కోరుతూ సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని కోర్టు ఆమోదించడంతో ఆయన 10 రోజుల పాటు లండన్ టూర్ కు వెళ్లి తిరిగి వచ్చారు. అయితే ఆ లోపే కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. జగన్ పై సీబీఐ అధికారులు సీబీఐ కోర్టును ఆశ్రయించారు. ఆయన సెల్ ఫోన్ నంబర్ విషయంలో అభ్యంతరం వ్యక్తంచేశారు. అయితే ఆ లోపే జగన్ తిరిగి వచ్చేశారు. జగన్ సీబీఐ కోర్టు అనుమతితో ఇప్పటికే పలుమార్లు విదేశీ పర్యటనలకు వెళ్లి వచ్చారు. అయితే ఈసారి లండన్ టూర్ కు వెళ్లే సమయంలో కోర్టు షరతుల మేరకు సీబీఐకి సమర్పించిన సెల్ ఫోన్ నంబర్ వివాదానికి కారణమైంది. గతంలో ఇచ్చిన నంబర్ వేరేది కావడం, ఈసారి ఇచ్చిన నంబర్ కొత్తది కావడంతో దీనిపై సీబీఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే ఆలోపే జగన్ విదేశాలకు వెళ్లిపోయారు. దీంతో చేసేది లేక సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. జగన్ బెయిల్ షరతుల్ని ఉల్లంఘించారని, తమకు అందుబాటులో ఉండేందుకు ఇచ్చిన ఫోన్ నంబర్ మార్చి ఇచ్చారని అభ్యంతరం తెలిపింది. ఈ నేపథ్యంలో జగన్ బెయిల్ రద్దు చేయాలని కూడా వాదించింది. అయితే జగన్ విదేశాల నుంచి తిరిగి వచ్చిన నేపథ్యంలో తాజాగా సీబీఐ కోర్టులో ఈ కేసుపై విచారణ జరిగింది. ఇందులో జగన్ బెయిల్ షరతులు ఉల్లంఘించినట్లు సీబీఐ వాదించగా.. అసలు జగన్ సెల్ ఫోనే వాడటం లేదని ఆయన లాయర్లు కోర్టుకు తెలిపారు. దీంతో సీబీఐ షాకైంది. జగన్ అసలు సెల్ ఫోన్ వాడటం లేదని, సీబీఐకి అందుబాటులో ఉండేందుకు ఓ మొబైల్ నంబర్ ఇచ్చారని సీబీఐ కోర్టుకు ఆయన లాయర్లు తెలిపారు. కానీ సీబీఐ మాత్రం బెయిల్ షరతులు ఉల్లంఘించారని, గతంలో ఇచ్చిన నంబర్, ఈసారి ఇచ్చిన నంబర్ ఒకటి కాదని వాదించింది. దీంతో సీబీఐ కోర్టు న్యాయమూర్తి.. వాదనలు పూర్తి చేసి ఈ వ్యవహారంలో ఈ నెల 28న తీర్పు ఇస్తామని వెల్లడించారు. దీంతో జగన్ బెయిల్ షరతులు ఉల్లంఘించారా లేదా అనేది 28న తేలనుంది.

## వండువ ఇనాం భూముల రైతుల్ని అన్నదాత సుఖీభవ జాబితాలో చేర్చండి

- జాబితా సవరించి న్యాయం చేయాలి
- మన్యం జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

- 8లో

## సిఎస్ విజయనంద్ తో భేటీ అయిన నీతి ఆయోగ్ సిఇఓ



**అమరావతి,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** పూర్వోదయ పథకం మరియు విశాఖపట్నం గ్రోత్ హబ్ పై గురువారం ఎపి సచివాలయంలో నీతి ఆయోగ్ సిఇఓ బివిఆర్ సుబ్రహ్మణ్యం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తో సమావేశమై చర్చించారు.ఈసందర్భంగా నీతి ఆయోగ్ సిఇఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశ తూర్పు తీరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రపదేశ్ ముందుందని పూర్వోదయ పథకం ద్వారా తీరప్రాంతంలో మరింత అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో పలు ఓడరేవులు ఉన్నప్పటికీ ప్రత్యేకంగా ఒక కంటైనర్ మెగాపోర్టు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆదిశగా తగిన ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వానికి సూచించారు.అదే విధంగా రానున్న చీఫ్ సెక్రటరీల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తీసుకుంటున్న వినూత్న పథకాలపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చేందుకు వీలుగా తగిన నివేదికను సిద్ధం చేసుకోవాలని సిఎస్ విజయానంద్ కు ఆయన సూచించారు.అనంతరం విశాఖపట్నం, అమరావతి,తిరుపతి గ్రోత్ కారిడార్ల ఏర్పాటు తద్వారా జరిగే అభివృద్ధి ప్రయోజనాలపై ఆయన చర్చించారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ విశాఖపట్నం గ్రోత్ హబ్ పనులు వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఒక అధికారిని ఇన్చార్జిగా నియమించడం జరుగుతుందని చెప్పారు .రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులను వేగవతంగా ముందుకు తీసుకువెళ్ళడం తోపాటు అనేక నూతన ప్రాజెక్టులు, పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా ప్రభుత్వం పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తోందని వివరించారు.కేంద్రం నుండి వివిధ ప్రాజెక్టులు,పథకాలకు సకాలంలో తగిన నిధులు మంజూరు అయ్యేలా కృషి చేయడం జరుగుతోందని కేంద్రం నుండి తగిన నిధులు మంజూరు అయ్యేలా నీతి ఆయోగ్ సిఫార్సు చేయాలని సిఎస్ విజయానంద్ నీతి ఆయోగ్ సిఇఓ సుబ్రహ్మణ్యంకు విజ్ఞప్తి చేశారు. కాగా పూర్వోదయ అనేది దేశ తూర్పుతీరంలోని ఆంధ్రప్రదేశ్,ఒడిస్సా,పశ్చిమ బెంగాల్, ఝార?ండ్,బీహార్ ఐదు రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఒక వినూత్న పథకం.ఇది సాంస్కృతిక వారసత్వం మరియు సహజ వనరులను ఉపయోగించుకోవడం,కొత్త మౌలిక సదుపాయాలను సృష్టించడం,ఉపాధిని సృష్టించడం మరియు స్థిరమైన ఆర్థికవృద్ధిని ప్రోత్సహించడం ద్వారా తూర్పు భారతదేశాన్ని జాతీయ పురోగతికి కీలకమైన చోదకంగా మార్చాలనే లక్ష్యంతో పూర్వోదయ పథకాన్ని చేపట్టడం జరిగింది.దీనిద్వారా పెద్దఎత్తున రహదారులు వంతెనలు,విమానాశ్రయాలు,విద్యుత్ ప్లాంట్లు వంటి ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడం జరుగుతుంది.ఈ ప్రాజెక్టులు ప్రాంతీయ కనెక్టివిటీని మెరుగుపరచడానికి, పారిశ్రామికాభివృద్ధికి మరింత దోహద చేస్తాయి.అంతేగాక పూర్వోదయ విద్యా మరియు నైపుణ్య–అభివృద్ధి సంస్థలను బలోపేతం చేయడానికి ప్రాధాన్యత ఇస్తుంది.అర్హత కలిగిన శ్రామిక శక్తిని సిద్ధం చేయడానికి ఐఐటి ఇతర నైపుణ్య–శిక్షణా కేంద్రాల్లో సామర్థ్య విస్తరణ కూడా దోహదపడుతుంది. పూర్వోదయ పథకం వ్యవసాయం మరియు అనుబంధ రంగాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు,ఉద్యోగ అవకాశాలు,నైపుణ్యాభివృద్ధిని పెంపొందిస్తుంది.అంతేగాక పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుకు మద్దతు ఇవ్వడం తోపాటు పెట్టుబడులను ప్రోత్సహిస్తూ

- 8లో

## మత్స్యకారులను క్షేమంగా తీసుకువస్తాం

### – కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.

- ఇప్పటికే విదేశాంగ శాఖ మంత్రితో మాట్లాడిన రామ్మోహన్ నాయుడు.
- బంగ్లాదేశ్ ఎంబసీ తో నిరంతర సంప్రదింపులు, నిశిత పరిశీలన.
- సముద్ర భద్రత, చట్టం, రక్షణ వ్యవహారాలు చూసే కోస్ట్ గార్డ్ వ్యవస్థతో ఈ సమస్యపై మాట్లాడిన రామ్మోహన్ నాయుడు.





**న్యూఢిల్లీ (పి.ఐ.బి.),అక్టోబరు 23 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం జిల్లాకు చెందిన ఎనిమిది మంది మత్స్యకారులు పొరపాటున బంగ్లాదేశ్ సముద్ర జలాల్లోకి ప్రవేశించిన నేపథ్యంలో అక్కడి నేవీ అధికారుల చేతిలో బందీలు అయిన ఘటన ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. డిల్లీలో ఉన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే బాధితులను తిరిగి సొంత ప్రాంతాలకు తీసుకువచ్చే చర్యలను వేగవంతం చేశారు. ఇప్పటికే ఈ సమస్యపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ తో చర్చించి పరిస్థితిని వివరించారు. బుధవారం రాత్రి ఇదే విషయంపై విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ తో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సమీక్షలో ప్రభుత్వం తరుపున అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా జై శంకర్ తెలియజేశారు. అలానే బంగ్లాదేశ్ లో ఉన్న ఇండియా మిషన్, మరియు కోస్ట్ గార్డ్ లతో నిరంతరం ఇదే విషయంపై ఆ సంప్రదింపులు చేస్తున్నట్లు రామ్మోహన్ నాయుడుకు పరిస్థితిని తెలియజేశారు. కాగా విజయనగరం జిల్లా భోగాపురం ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది మత్స్యకారులు.. ఈ నెల 13న విశాఖలోని రెల్లివీధికి చెందిన సత్యనారాయణకు చెందిన బోటును తీసుకొని చేపల వేటకు వెళ్ళారు. బుధవారం తెల్లవారుజామున వేట కొనసాగిస్తుండగా పొరపాటున బంగ్లాదేశ్ సాగర జలాల్లోకి వెళ్లినట్టు గుర్తించారు. దీంతో అక్కడి నౌకాదళ అధికారులు మత్స్యకారులను అదుపులోకి తీసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. ఈ సంఘటనపై ఇప్పటికే దుబాయ్ పర్యటనలో సీఎం చంద్రబాబు నాయుడు సైతం సత్వరమే స్పందించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా నిరంతరం అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించడమే కాకుండా వారిని జాగ్రత్తగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## మారేమండకు బస్సు సౌకర్యం అడిగిన నందమూరి ఆడపడుచులు



**విస్సన్నపేట,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు దివంగత టిడిపి సీనియర్ నాయకులు నందమూరి వెంకట్రావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు . అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. దేశ విదేశాల నుండి వచ్చిన నందమూరి ఆడపడుచులు శాసనసభ్యునికి తమ పుట్టిల్లు మారేమండకు ఉదయం,సాయంత్రం బస్సుల సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెల్లదేవరపల్లి సహకార సంఘం అధ్యక్షులు వీరమాచినేని కృష్ణ ప్రసాద్, మిల్క్ సొసైటీ అధ్యక్షురాలు నెక్కలపు వాణిశ్రీ, మురుగుల ప్రసాద్, వేమన,నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఉపాధ్యాయులకు డి.పి.ఆర్.టి.యు.భరోసా






**కైకలూరు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** డెమొక్రటిక్ పిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ డి శ్రీను నూతన ఉపాధ్యాయులకు భరోసా కల్పించుటకు రాష్ట్రవ్యాప్తంగా వారికి సపోర్ట్ చేస్తూ వారి విధులు హక్కుల గురించి అవగాహన చేస్తూ పర్యటిస్తున్నారు.గురు వారం సాయంత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతపాడు నందు జరిగిన కార్యక్రమంలో ఏడుగురు నూతన ఉపాధ్యాయులకు దుస్సాలువాలతో సన్మానించి వారిని ఉపాధ్యాయ వృత్తిలోకి ఆహ్వానిస్తూ ఒక సర్టిఫికెట్ ను బహుకరిస్తూ వారికి పిఆర్టియు అందించే రకరకాలైన సేవా కార్యక్రమాలు వివరిస్తూ వారు ఉపాధ్యాయ జీవితంలో సాధించవలసిన లక్ష్యాలు ప్రభుత్వ పాఠశాలను ఏ విధంగా రక్షించాలి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏ విధంగా బోధించి వారు ఉన్నతకి ఎలా కృషి చేయాలో వారికి అవగాహన చేయడం జరిగింది. వారికి అన్ని రకాలైన సహాయ సహకారాలు అందిస్తామని సంఘం తరఫున వారికి భరోసా కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని భలే భాగ్యలక్ష్మి , రాష్ట్ర ఉపాధ్యక్షులు జివిఎస్ రామాంజనేయులు మరియు జిల్లా కార్యదర్శి లక్ష్మీకాంతం, మండల అధ్యక్షులు రామోజీ , పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు , జి వి ఆర్ , శంకర్,రోజా రాణి , శివ శాంతి , నోబుల్ , శేషగిరి , పార్థు మరియు నూతనంగా పాఠశాలలో చేరిన ఉపాధ్యాయులు రమేష్ అంబేద్కర్ నాగరాజు, ఉషా రాణి, వెంకటరమణ , నవ్యశ్రీ, ,గాయత్రి లు పాల్గొన్నారు.

## కాకినాడలో యూత్ హాస్టల్ ఏర్పాటు చేయాలి

### -కేంద్ర మంత్రిని కోరిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ, అక్టోబరు 23 (వార్తాప్రభ) :** జిల్లా కేంద్రం కాకినాడలో కేంద్ర ప్రభుత్వ యూత్ హాస్టల్ పథకం కింద అధునాతన సౌకర్యాలతో యూత్ హాస్టల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గురువారం కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి మాన్సుఖ్ మాండవియాకు లేఖ రాశారు. సముద్ర తీర ప్రాంతం ఉన్న కాకినాడ నగరం పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, అమలాపురం, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో అత్యధికంగా ఉన్న యువత కు ఉపయోగకరంగా ఉండేలా అత్యాధునిక హంగులతో కాకినాడలో యూత్ హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. తద్వారా స్థానిక యువతకు ఉపయోగకరంగా ఉండడంతో పాటు, ఇతర రాష్ట్రాల క్రీడలు, స్టడీ టూర్, విజ్ఞాన విహార యాత్రలు కోసం వచ్చే యువతకు సురక్షితమైన వసతి కల్పించేందుకు అవకాశం ఏర్పడుతుందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

## గ్రామ గ్రామాన ఉదృతం అవుతున్న కోటి సంతకాల కార్యక్రమం

- స్టేట్ ఎగ్జిక్యూటివ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిల్ నెంబర్
- మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి( సూరి రెడ్డి)



**విస్సన్నపేట,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్ది రెడ్డి సూర్యనారాయణ రెడ్డి గృహ ప్రాంగణంలో కోటి సంతకాల కార్యక్రమం ప్రారంభించారు. వైద్యుల సంఖ్య పెంచే లక్ష్యంగా నేషనల్ మెడికల్ కమిషన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ మెడికల్ సీట్లను 106 అదనంగా మన రాష్ట్రానికి ఇచ్చిందన్నారు. వాటిలో ఏపీ ప్రభుత్వం లేవు అని చెబుతున్న మెడికల్ కళాశాలకు సీట్లు కేటాయించటం అందరికీ తెలిసిందే అన్నారు. ప్రైవేటీకరణ వలన మెడికల్ కౌన్సిలింగ్ నందు పేద కుటుంబాలు అధిక ఫీజులతో సీట్లు సాధించలేరని ఆయన చెప్పారు. ప్రతి పేదవాడు ఆర్థికంగా ఎదిగేందుకు ఒక వారధి వంటిది విద్య అనే నగ్న సత్యాన్ని సర్వత్రా తెలిసిందే అని అన్నారు . వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ వలన మెడికల్ విద్య పేదలకు అందని ద్రాక్ష అవుతుంది అన్నారు. రచ్చబండ వేదికగా మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే సంతకాల సేకరణ కార్యక్రమం సంతకాలు చేసేవారి సంఖ్య రోజురోజుకు ఉదృతం అవుతుందని ఆయన తెలిపారు. పుట్రేల గ్రామ సర్పంచ్ స్వాతి పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఆకస్మిక వరదల పట్ల అప్రమత్తంగా ఉండండి : శాసనసభ్యులు యార్లగడ్డ



**గన్నవరం,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో గన్నవరం నియోజకవర్గంలోని రెవెన్యూ, పోలీస్, ఫైర్, వ్యవసాయ శాఖ, డ్రైనేజీ అధికారుల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ఆదేశించారు. గురువారం నుండి భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని యార్లగడ్డ కోరారు. ఆకస్మిక వరదలు(ఫ్లాష్ ఫ్లెడ్స్ ) వచ్చే ప్రమాదం ఉందంటూ వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరికలు జారీ చేసిన దృష్ట్యా ముంపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి వారికి సురక్షిత తగునీరు, ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెరువులు, వాగులు కాలువలకు గండ్లు పడకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా అంటువ్యాధులు ప్రభలకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలని, డ్రైనేజీలు పూడిక తీసి వాననీరు సక్రమంగా పారుదల అయ్యేలా చూడాలని ఆదేశించారు. పంటనష్టం నివారణకు రైతులకు తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని వ్యవసాయశాఖ అధికారులను కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఏ విధమైన ఇబ్బంది ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని యార్లగడ్డ సూచించారు.

## టెట్ నుండి మినహాయింపునివ్వాలి....

### పి.ఆర్.టి.యు విజ్ఞప్తి




**నందిగామ/పెనుగంచిప్రోలు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** ప్రస్తుతం సర్వీస్ లో ఉండి,బోధనలో దశాబ్దాల అనుభవం ఉన్న టీచర్స్ కూడా, టెట్ లో అర్హత సాధించాలని, లేకపోతే పదోన్నతికి అర్హులు కారనే నిబంధన తొలగించాలని పి.ఆర్.టి.యు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు షేక్. నవాబ్ జానీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెనుగంచిప్రోలు మండలంలో, శనగపాడు, వెంగనాయకునిపాలెం, కొల్లికుళ్ళ, సుబ్బాయిగూడెం, పెనుగంచిప్రోలు, ముండ్లపాడు, కొనకంచి తదితర గ్రామాలలోని, పాఠశాలలో పెద్ద ఎత్తున పి.ఆర్.టి.యు సభ్యత్వ నమోదు నిర్వహించిన తదుపరి విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఆవుల. రాంబాబు, మర్రి.ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్ పచ్చల.సునీల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్. నజీర్, మండల అధ్యక్షుడు చాట్ల. నిరంజన్, నాయకులు ఎనికేపల్లి. శివకుమార్, షేక్. కరీముల్లా, కూతాటి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**కాకినాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** స్థానిక జగన్నాధపురం సురేష్ హై స్కూల్ విద్యార్థులకు గురువారం ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు. మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ వలన జరుగు ప్రమాదాలు, జీబ్రా లైన్స్ లేని ప్రదేశములలో రోడ్డు ను ఏవిధంగా దాటాలి, ట్రాఫిక్ గుర్తులు వలన ఉపయోగాలు తెలియచేశారు. ఆటో లలో పరిమితికి మించి ఎక్కువ మంది ఆటోలలో ప్రయాణించరాదని, ఆటోలలో వెనుకవైపు, ఆటో డ్రైవర్ కి ఇరువైపులా కూర్చోరాదని, బైక్ స్టంట్స్ చేయడం వలన కలుగు ప్రమాదాలు , హెల్మెట్ పెట్టుకోకుండా మోటార్ సైకిల్స్ నడపడం వలన కలుగు ప్రమాదాలు , సడన్ డోర్ ఓపెన్ వలన జరుగు ప్రమాదములపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలలో భాగముగా ఆన్లైన్ మోసాలు, ఫేక్ లోన్స్ మోసాలు, ఆన్లైన్ ఉద్యోగాలు, డిజిటల్ అరెస్ట్,



112, 1930, 1972 కాల్స్ యొక్క ఉపయోగములు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్ , ఎస్సై ఎం.ఏసుబాబు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## సంపూర్ణంగా తీరనున్న ఆధార్ కష్టాలు - ఎంపీడీవో చిన్న రాట్నాలు



**విస్సన్నపేట,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో పాఠశాల లలో చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వ పరంగా లబ్ది పొందేందుకు ఆధార్ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని ఎంపీడీవో చిన్న రాట్నాలు తెలియజేశారు. పుట్రేల జిల్లా పరిషత్ హై స్కూల్ నందు సచివాలయాల సిబ్బంది నిర్వహిస్తున్న ఆధార్ మార్పుల ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. 30వ తేదీ వరకు మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు సమస్యలు పరిష్కరించేందుకు పథక రచన చేశామన్నారు. మండల విద్యాశాఖ అధికారి శంకరరావు హెచ్ఎం ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గా అంగర రంగనాధ్



**పెడన,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గా అంగర రంగనాథ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ఎక్స్ ఆఫీసియో సెక్రటరీ ఎస్ సత్యనారాయణ ఉత్తర్వులు జరీచేసారు. శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సూచన మేరకు ఈ నియామకం జరిగింది. పెడన నియోజకవర్గం బంటుమిల్లి కి చెందిన రంగనాథ్ న్యాయవాద వృత్తిలో ఉన్నారు. టిడిపిలో క్రియాశీల నాయకునిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మండల టిడిపి అధ్యక్ష పదవి కోసం పోటీ పడ్డారు. రంగనాథ్ డైరెక్టర్ పదవిలో రెండు సంవత్సరాల పాటు కొనసాగుతారు.

## శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీల్లో 2,30,817 లక్షలు ఆదాయం



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ నూజివీడు రోడ్ లోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండిలను గురువారం లెక్కించారు. గన్నవరం దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ కే. వి,అనురాధ పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపు కార్యక్రమం జరిగింది. 2, 30, 817 లక్షల రూపాయల ఆదాయం వచ్చినట్లు దేవాలయ ఇ ఓ యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. 17 ఏప్రిల్ నెలలో. లెక్కించామని మళ్లీ ఇప్పుడు 6 నెలలకు. ఈ లెక్కింపు చేసినట్లు ఇ. ఓ, యార్లగడ్డ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ ఫౌండర్ ట్రస్టీ కాకాని అరుణ, అర్చకులు, సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

## ఈనెల 24, 25న కె గంగవరంలో మెగా ఉచిత వైద్య శిబిరం



**కె. గంగవరం,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె గంగవరం మండలం గంగవరంలో ఈనెల 24,25 తేదీల్లో రెండు రోజులు పాటు మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కార్యాలయం తెలిపింది. కె గంగవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ వైద్య శిబిరం పైప్ లైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, టీ ట్రి హాస్పిటల్స్, ఫౌండేషన్ బెంగళూరు ఆధ్వర్యంలో జరగనుంది. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభిస్తారు. ఈ వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందిస్తారు. బి పి, షుగర్, ఇ ఎన్ టి, మెడ/ తల వైద్య పరీక్షలు, స్త్రీ వ్యాధుల నిపుణులు, గర్భాశయ క్యాన్సర్, రొమ్ము ఆరోగ్యం, బిఎసి శిక్షణ, పురుషులకు ప్రొస్టేట్ ఇతర ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, ఉచిత కళ్ళజోళ్ళు, దంత పరీక్షలు, గమ్ వ్యాధుల అవగాహన, ఫిజియోథెరపీ నొప్పులు తదితర సేవలు అందిస్తారు. అలాగే ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలు సి బి సి, ఆర్ బి సి, బ్లడ్ గ్రూప

## ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్న డ్రైన్ లను పరిశీలించిన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్



**పెడన,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో ప్రమాదకరంగా మారిన డ్రైన్ లను కాలువలను శ్యాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ గురువారం నాడు పరిశీలించారు. రాష్ట్రానికి తుఫాను లేదా వాయుగుండం కావలి-మచిలీపట్నం మధ్యలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో కోస్తా అంతటా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఇప్పటికే అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయని ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటుదని. బంగాళాఖాతంలో తీవ్ర అల్ప ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పెడన నియోజకవర్గం ప్రజలకు ఆయన పలు సూచనలు చేశారు.అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని అన్నారు. భారీ వర్షం కారణంగా ఎటువంటి సమస్య లేకుండా కాల్వలలో పేరుకుపోయిన గుర్రప డెక్కలను నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న వాటిని తొలగించి నీటి ప్రవాహం ఎక్కడ ఆగకుండా చూడాలని రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని డీసీ చైర్మన్ నీటి సంఘం అధ్యక్షులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులను ఆందోళన చెందుద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మండల పార్టీ అధ్యక్షులు కూనపురెడ్డి వీరబాబు డీసీ చైర్మన్ బొర్రా కాశీ నీటి సంఘం అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు

## సనాతన సాంప్రదాయాల పరిరక్షణ,భక్తుల సౌకర్యాలపై చర్చించిన ఎంపీ సానా సతీష్



**కాకినాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి, సనాతన సంప్రదాయాల పరిరక్షణ,భక్తుల సౌకర్యాల పెంపు వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.సతీష్ బాబు ప్రాంతీయ దేవాలయాల అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపు, యాత్రికులకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుపై మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇద్దరు నేతలు ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ రాష్ట్రం సాంస్కృతిక వారసత్వాన్ని నిలబెట్టే దిశగా ప్రభుత్వము కృషి కొనసాగిస్తుందని తెలిపారు.

## విద్యుత్ ఘాతానికి ఒకరు మృతి



**కోడూరు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** విద్యుత్ ఘాతానికి గురై ఒకరు మృతి చెందిన సంఘటన కోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెర పాలెం లో చోటుచేసుకుంది. కోడూరు ఎస్సై చాణిక్య తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సానందుల నాంచారయ్య (60) తనకి ఉన్న చిన్నపాటి పూరి పాకలో జీవిస్తుంటాడన్నారు. బుధవారం విద్యుత్ షాక్ కి గురై మృతి చెందినట్లు మృతిని కుమార్తె తన్నీరు మంగమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

## విజయా డెయిరీ వేతన కార్యదర్శులకు బోనస్ పంపిణీ చేసిన చైర్మన్ చలసాని ఆంజనేయులు





**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** ప్రాజెక్టు కామధేను వీరవల్లి ప్లాంట్ ఆవరణలో గురువారం హనుమాన్ జంక్షన్ క్లస్టర్ పరిధిలోని వేతన కార్యదర్శులకు 2024-2025 ఆర్థిక సంవత్సరమునకు 18,19,198 లక్షల రూపాయలు బోనస్ కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మొత్తం మీద 1,24,54,238 కోట్ల రూపాయలు పంపిణీ చేయనున్నట్లు చైర్మన్ చలసాని తెలిపారు. తదనంతరం వేతన కార్యదర్శి లు చైర్మన్ చలసాని ఆంజనేయులు ని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు, ప్రొక్యూర్మెంట్ జి ఎం పారీ, సంఘ అధ్యక్షులు మరియు వేతన కార్యదర్శులు పాల్గొన్నారు.

## వార్షిక తనిఖీలు నిర్వహించిన ఏసిపి ప్రసాదరావు





**విస్సన్నపేట,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏసిపి ప్రసాదరావు ( మైలవరం) వార్షిక ఇన్స్పెక్షన్ నిర్వహించారు. స్టేషన్ రికార్డ్స్, ఫైల్స్, ప్రాంగణంలోని పాత వాహనాలను ఆయన పరిశీలించారు. ఎస్ ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

# సుందరీకరణ తో మార్కెట్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం.

## కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే గాంధీ పర్యటన



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 23 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి డివిజన్ లోగల నల్లగండ్ల వెజిటేబుల్ మార్కెట్ లో నూతనంగా చేపడుతున్న పునర్నిర్మాణం పనులను శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ తో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుందరీకరణతో మార్కెట్ ను ఆదర్శంగా తీర్చితిద్దుతామని వారు తెలిపారు.యుద్ధ ప్రాతిపదికన అత్యవసర పనులను గుర్తించి పనులు చేపడుతున్నట్లు అన్నారు.మార్కెట్ అభివృద్ధితో పాటు చిరు వ్యాపారులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ప్రెసిడెంట్ వీరేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు జనార్ధన్ రెడ్డి,కే రాంచందర్,విష్ణువర్ధన్ రెడ్డి,గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్,మార్కెట్ వైస్ ప్రెసిడెంట్ ఖాజా పాషా,రషీద్,అజీమ్, అస్లాం,శ్రీనివాస్ ,శంకర్,ఆంజనేయులు, అజామ్,సాయి,మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణ, భద్రతకు సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరం : ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 23, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ 132 – జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎంక్లేవ్ లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాల నియంత్రణ భద్రతకై చేపట్టవలసిన చర్యలపై సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రహరీ గోడ నిర్మాణంతో నేరాల నియంత్రణ జరగడంతో పాటు భద్రత కట్టుదిట్టమవుతుందని, కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసులకు తెలియజేయాలన్నారు. నేరాల నియంత్రణ విషయంలో కాలనీ వాసుల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ విజయ్ వర్ధన్, డిఐ అజయ్ కుమార్, సంక్షేమ సంఘం అధ్యక్షులు కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి పుప్పాల నాగరాజు, సభ్యులు ఇంద్రా రెడ్డి, సురేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే కు పలు ఆహ్వానాలను అందజేసిన నియోజకవర్గం ప్రజలు



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 23, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నివాసం వద్ద గురువారం నియోజకవర్గం ప్రజలు, పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానాలను అందజేయడం జరిగింది. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ సానుకూలంగా స్పందించి ఆహ్వానాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, దుర్గారావు, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి, మాజీ కౌన్సిలర్ బొబ్బ రంగారావు, బొడ్డు రవి, లింగం యాదవ్, బాలరాజ్, మోతే శ్రీనివాస్ యాదవ్, కూన రాఘవేంద్ర గౌడ్, సునీల్ చౌదరి, నాయుడు, రంగా, ఎల్లేష్, మూర్తి, కోటేశ్వరరావు, సురేష్, ప్రసాద్, యాదవ రావు తదితరులు పాల్గొన్నారు.



కాప్రా మండలం నూతన తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన బైరెడ్డి రాజేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన జవహర్ నగర్ కో–ఆప్షన్ సభ్యులు మహమ్మద్ నూరుద్దీన్ ఫారూఖ్ **జవహర్ నగర్, అక్టోబర్ 23:(వార్తా ప్రభ)**

# ఇచ్చంత్రపు ఇంగ్లీష్ మీడియం స్కూళ్లు!!

● కం రే...సిట్ రే...గో రే...ఈట్ రే ● "ఇంగ్లీష్"కే ఎంగిలి పీస్ నేర్పిస్తున్న టీ...టీ...టీచర్లు ● అగ్గి పెట్టె రూములు..... హై ఎండ్ ఫీజులు ● టేబుల్లు మస్టు.....కిందనే సిట్టు ● వెంటిలేషన్ నిల్లు.....కలరింగ్ ఫుల్లు ● లోకల్ టీచర్లతో క్వాలిటీ ఎడ్యుకేషన్? ● ప్రభుత్వ మార్గదర్శకాలకు శఠగోపం... తూట్లు ● తల్లిదండ్రుల జేబులకు కుచ్చుటోపి ● వారెవ్వా...జర ప్రైవేట్ స్కూళ్ళ తమాషా దేకో

**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**ఇచ్చంత్రపు ఇంగ్లీష్ మీడియం స్కూళ్ల యవ్వారం రోజు రోజుకు ధనార్జనే ధ్యేయంగా కొనసాగుతున్నవి. కం రే...సిట్ రే...గో రే...ఈట్ రే... అంటూ ప్రతి ఇంగ్లీష్ పదానికి రే...రే... కలుపుతూ వచ్చి రాని ఇంగ్లీష్ మాట్లాడుతూ ఇంగ్లీష్ కే ఎంగిలి పీస్ నేర్పిస్తున్నరు టీ...టీ...టీచర్లు. అగ్గి పెట్టె రూములు..... హై ఎండ్ ఫీజులు చూసి తల్లిదండ్రుల మైండ్ బ్లాక్ అవుతుందంటే అతిశయోక్తి కాదు. కొన్ని ప్రైవేట్ స్కూళ్లలో అయితే మరీ దారుణం ఏంటంటే టేబుల్లు సరిపడా లేవు.....కిందనే సీటు అన్నట్లు తూతూ మంత్రంగా తరగతుల నిర్వహణ కొనసాగిస్తున్నారు. వెంటిలేషన్ నిల్లు.....కలరింగ్ ఫుల్లు ఇస్తూ విద్యాసంస్థలను బిజినెస్ గా మార్చేశారు. లోకల్ టీచర్లతో క్వాలిటీ ఎడ్యుకేషన్ అని బోర్డులు పెడుతున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు శఠగోపం పెట్టి అపార్ట్మెంట్లలో, ప్రైవేటు హౌజులలో విద్యాసంస్థలను, కిడ్స్ స్కూల్స్ ను రన్ చేస్తున్నారు. కనీసం తరగతి గది యొక్క వైశాల్యం ఎంత ఉండాలి, వెంటిలేషన్ కోసం ఎన్ని కిటికీలు ఉండాలి, విద్యార్థులకు సరిపడా ఫ్యాన్లు, లైటింగ్ ఎంత ఉండాలి, ఏ రకమైన టేబుల్స్ ఉండాలి, పాఠశాల విద్యార్థుల కోసం బాల బాలికలకు సపరేట్గా ఎన్ని టాయిలెట్స్ ఉండాలి, ఏ విధమైన డ్రింకింగ్ వాటర్ ఫెసిలిటీ అందజేయాలి, విద్యార్థులు లంచ్ చేయడానికి డైనింగ్ హాల్, ఓపెన్ ప్లేస్ ఎంత ఉండాలి, ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే ఏ రకమైన రక్షణ పరికరాలు ఉండాలి, విద్యార్థులు ఆడుకోవడానికి ఎంత విస్తీర్ణంలో ఆట స్థలం ఉండాలి, ఆటలాడుతూ గాయాల పాలైనప్పుడు




ప్రథమ చికిత్స అందించడానికి ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఎన్ని ఉండాలి, ఇవన్నీ పక్కన పెట్టి ప్రాజెక్టు వర్కులు అంటూ, కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యాశాఖ బలోపేతంపై కసరత్తు చేస్తున్నారని పదేపదే ప్రభుత్వ యంత్రాంగం అధికారులు చెబుతున్నారు. అయితే గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో ఈ విధంగా ప్రభుత్వ నియమ నిబంధనలకు తూట్లు పొడుస్తూ ధనార్జనే ధ్యేయంగా ఇంగ్లీష్ మీడియం స్కూళ్లను నిర్వహిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని వివిధ స్టూడెంట్ ఆర్గనైజేషన్స్ డిమాండ్, పోరాటం ఎంతవరకు సక్సెస్ అవుతుందో వేచి చూద్దాం...

# ఎల్లప్పుడు ప్రజల మధ్య ఉండే నవీన్ యాదవ్ కే మన ఓటు

## కాంగ్రెస్ నాయకులు మిరియాల ప్రీతం డోర్ టు డోర్ ప్రచారం



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 23 (వార్తాప్రభ):**జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కి మద్దతు తెలుపుతూ చందానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకుడు మిరియాల ప్రీతం ఆధ్వర్యంలో డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా మిరియాల ప్రీతం మాట్లాడుతూ నవీన్ యాదవ్ ప్రజల మధ్య ఎల్లప్పుడూ ఉంటూ వారి సమస్యలకు పరిష్కార మార్గాలు చూపే నాయకుడు.ఆయన ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునే సదాశయత కలిగిన అభ్యర్థి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రజలు గత కొంతకాలంగా స్పష్టమైన అభివృద్ధిని చూసి సంతోషంగా ఉన్నారు.రేవంత్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి వర్గాన్నీ ఆకర్షిస్తున్నాయి.జూబ్లీహిల్స్ అభివృద్ధికి కాంగ్రెస్ పాలన అత్యవసరం.అందువల్ల నవీన్ యాదవ్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రాంతాభివృద్ధికి తోడ్పడాలని ప్రతి ఓటరు కోరుకోవాలి,అని అభిప్రాయపడ్డారు.ఈ ప్రచార కార్యక్రమంలో మిర్యాల రాఘవరావు,దాసరి గంగరావు, జగన్నాధ రావు,శ్యామల రావు, సుబ్రహ్మణ్యం,పరదేశి నాయుడు, ప్రసాద్,విట్టల్,సాయి,టిల్లు తదితర నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో భవిష్యత్తు విజేతలు బారాస, వైఎస్ఆర్సిపిలదే.

## *ప్రజా బలంతో కెసిఆర్, జగన్ తిరిగి అద్భుత విజయాలు చేజిక్కించు కుంటారు*

## *బా.సా.ర.సీనియర్ నేత రవీందర్ యాదవ్ వెల్లడి*





**శేరిలింగంపల్లి,అక్టోబర్ 23 (వార్తాప్రభ):**ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం,వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో శేరిలింగంపల్లి యువ నాయకులు,భారాస సీనియర్ నేత రవీందర్ యాదవ్ భేటీ అయ్యారు.రానున్న ఎన్నికల్లో శేరిలింగంపల్లి నుంచి బీఆర్ఎస్ తరుపున పోటీ చేయబోతున్నట్లుగా వైఎస్ జగన్ కు వెల్లడించారు.తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.రవీందర్ యాదవ్ పోటీ చేస్తే తన మద్దతు ఉంటు ందని,నేను అండగా ఉంటానని వైఎస్ జగన్ తెలిపారు. ప్రజాక్షేత్రంలో పోరాటం చేయాలని, విజయం తథ్యం అని స్పష్టం చేశారు .ఇటీవల జన్మదినం సందర్భంగా వైఎస్ జగన్ రవీందర్ యాదవ్ కు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.వైఎస్ జగన్ కు రవీందర్ యాదవ్ శ్రీకృష్ణుడి ప్రతిమను అందించారు.తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిసి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.శేరిలింగంపల్లిలో పోటీ చేయాలని రవీందర్ యాదవ్ కు ఈ సందర్భంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సూచించారు.నేను ఉన్నాను అనే భరోసాను వైఎస్ జగన్ ఇచ్చారు. శేరిలింగంపల్లిలోని పరిస్థితులను ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ వైఎస్ జగన్ కు వివరించారు. కేసీఆర్ ఎలా ఉన్నారని వైఎస్ జగన్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లిలో మంచి భవిష్యత్ ఉందని,ప్రజల కోసం పోరాడాలని సూచించారు. ఏ అవసరం ఉన్నా తాను ఉన్నానని వైఎస్ జగన్ రవీందర్ యాదవ్ కు భరోసాను ఇచ్చారు. వైఎస్ జగన్ ను కలిసి మాట్లాడటంపై రవీందర్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.దమ్మున్న లీడర్ కు ప్రజలు ఎప్పుడూ అండగా ఉంటారని,వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో భారాస, ఆంధ్రాలో వైసీపీ అధికారంలోకి రాబోతున్నా యన్నారు.కేసీఆర్, వైఎస్ జగన్ ను ఆపడం ఎవరి తరం కాదని రవీందర్ యాదవ్ అన్నారు.

# నిరుద్యోగ యువతకు వరం మెగా జాబ్ మేళా

● బెల్లంపల్లి మెగా జాబ్ మేళా పోస్టర్ విడుదల సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్
● నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్న సీఎండీ ఎన్.బలరామ్



**హైదరాబాద్, అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఈనెల 26వ తేదీన సింగరేణి ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు సంబంధించిన ప్రచార పోస్టర్ ను హైదరాబాద్ సింగరేణి భవన్ లో గురువారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ ఆవిష్కరించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ప్రజా ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా బెల్లంపల్లిలో సుమారు 80 కి పైగా ప్రైవేటు కంపెనీల వారితో మెగా జాబ్ మేళాను వచ్చే ఆదివారం నిర్వహిస్తున్నామని, దీనిని ఆ ప్రాంత నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎన్. బలరామ్ పిలుపునిచ్చారు. జాబ్ మేళాలో పాల్గొనదలిచిన నిరుద్యోగ యువత పోస్టర్ లో ఉన్న క్యూఆర్ కోడ్ ని స్కాన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ మెగా జాబ్ మేళా ద్వారా నిరుద్యోగులు తమకు గల విద్యార్హతలకు సంబంధించిన ఉద్యోగాలను ఎంచుకునే అవకాశం కల్పిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో సింగరేణి ఆధ్వర్యంలో రామగుండం, వైరా, మధిర, భూపాలపల్లిలో నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా సుమారు 12,000 మందికి పైగా ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఇటువంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టినందుకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీఎం (కో ఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కు శుభాకాంక్షలు తెలిపిన సునీల్ చౌదరి బృందం...



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 23, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ 132– జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద షాపూర్ నగర్ కు చెందిన సునీల్ చౌదరి %ఁ% బృందం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలతో పాటుగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, నాయకులు సునీల్ చౌదరి, ప్రేమ్ కుమార్, సంతోష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

# రైతులు యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోండి- ఏవో,జి. నర్మదా




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సుజాతనగర్, మండలం లో రైతులు అందరూ యంత్రపరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఒక ప్రకటన తెలిపిన మండల వ్యవసాయ శాఖ అధికారి జి. నర్మద ఒక ప్రకటనలో తెలిపారు యంత్ర పరికరాల కోసం రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని.సుజాతనగర్ మండలంలో సబ్సిడీ లో ఉన్న యంత్ర పరికరాల వివరాలు.1. పవర్ వీడర్ -1 2. బ్రష్ కట్టర్ -2 3. పవర్ టిల్లర్ -14. స్ట్రా బ్యాలర్ -2( వరి గడ్డి చుట్టా యంత్రం) 5. చేతి పంపు – 134 6. పవర్ స్ప్రేయర్ – 20 7. రోటోవేటర్ – 98. విత్తనం మరియు ఎరువు వేయ యంత్రం(సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్) -1 9. ట్రాక్టర్ పనిముట్లు -10 10. బండ్ ఫార్మర్ -2(గట్లు వేయ యంత్రం)

**ధరకాస్తు చేసుకోవడానికి కావలసిన పత్రాలు** దరఖాస్తు ఫారం ,ఆధార్ కార్డు జిరాక్స్ ,పాస్ పోర్టు ఫోటో ,ట్రాక్టర్ ఆర్సీ ( ట్రాక్టర్ పరికరాలకు మాత్రమే) **గమనిక** : చివరి తేదీ 25-10-2025

# చైతన్యం, డ్రగ్స్ పై యుద్ధం"

## *ప్రజలకు అవగాహన కల్పించిన పోలీసులు*





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్ కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం మండల ఎస్ ఐ రమాదేవి ఆధ్వర్యంలో సుజాతనగర్ సెంటర్లో చైతన్యం, డ్రగ్స్ పై యుద్ధం" ప్రజలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు అనంతరం వారు మాట్లాడుతూడ్రగ్స్ అమ్మకం, రవాణా, , సేవించడం, కొనడం చట్టరీత్యా నేరం. అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు ఈనెల 15వ తారీకు నుండి వచ్చే నెల 15వ తారీకు వరకు ప్రతిరోజు చైతన్య%శీ% ప్రోగ్రాంలో భాగంగా ప్రజలకు డ్రగ్స్ గురించి అవగాహన కలిగించడానికి ప్రోగ్రాములు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అబ్దుల్ కలాం కాలేజ్, ధన్వంతర కాలేజ్ , శ్రీ కాలేజ్ మరియు సుజాతనగర్ మండలం రాజకీయ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

# జి.జి.హెచ్.లో కీమోథెరపీ సేవలు!!

● కీమోథెరపి సేవలు సద్వినియోగం చేసుకోవాలి
● జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్ సింగ్ ● రీజినల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజు






**పెద్దపల్లి/ గోదావరిఖని: అక్టోబర్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)** ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో డే కేర్ కేంద్రాలను ప్రభుత్వం నెలకొల్పడంతో రామగుండం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్లో గురువారం నుండి క్యాన్సర్ బాధితులకు కీమోథెరపీ సేవలు అందుబాటులోకి వచ్చాయని రీజినల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజు ప్రకటనలో వివరాలను వెల్లడించారు. జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్ సింగ్ కీమోథెరపి సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, డాక్టర్ ఫరీద్, డాక్టర్ ఇర్ఫాన్, నర్సింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు అని తెలిపారు.

# ఎడిటోరియల్

## కూటమి సర్కారుపై సంతృప్తి ఇదే.. తాజా లెక్క!

ఏపీ సీఎం చంద్రబాబు తన పాలనపై... ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. గతంలో కొంత వరకే దీనిపై దృష్టి పెట్టగా.. తాజాగా మాత్రం ప్రతి వారం.. ప్రతి నెలా ఒక కార్యక్రమంగా పెట్టుకుని మరీ ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఐవీఆర్ ఎస్ ఫోన్ కాల్స్, నేరుగా ప్రజల నుంచి సమాచారం తెలుసుకోవడం.. వివిధ పత్రికల్లో వస్తున్న పాజిటివ్, నెగిటివ్ వార్తలను సంకలనం చేసి.. సంతృప్తి లెక్కలు వేసుకుంటున్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక విభాగాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తాజాగా 16 మాసాల పాలనపై సేకరించిన లెక్కల ప్రకారం.. ప్రజలు కూటమి ప్రభుత్వం పట్ల 75 శాతం సంతృప్తితో ఉన్నారని తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా సీఎం చంద్రబాబు ప్రకటించడం విశేషం. తాజాగా ఆయన అధికారులతో జరిపిన చర్చల్లో ప్రభుత్వంపై ప్రజలు చాలా ఆకాంక్షలు పెట్టుకు న్నారని.. వారి ఆశలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. తాజా లెక్కల్లో 75 శాతం మంది కూటమి ప్రభుత్వంపై సంతృప్తి వ్యక్తం చేశారని.. కానీ.. దీనిని 85 – 95 శాతానికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇక, విభాగాల వారీగా చూస్తే.. రెండు శాఖలపై తప్ప.. మిగిలిన శాఖలపై ప్రజల నుంచి సంతృప్తి రికార్డు స్థాయిలో ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. సంక్షేమ శాఖ విషయంలో ప్రజలు 90 శాతం సంతృప్తితో ఉన్నారని.. నెలనెలా అందుతున్న పింఛన్లు, ఇతర ఆర్థిక సంక్షేమ కార్యక్రమాల విషయంలో ప్రజల సంతృప్తి .. గత రెండు మాసాలతో పోల్చుకుంటే .. ప్రస్తుతం మరింత పెరిగినట్టు తెలిపారు. ఇక, మద్యం పైనా ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరలకే అందిస్తున్నామన్నా రు. ఇది ప్రజల్లో పాజిటివిటీని పెంచినట్టు తెలిపారు. అయినప్పటికీ.. ప్రజల సంతృప్తి స్థాయిలను పెంచాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. 85– 95 శాతానికి చేరితే తప్ప.. ఎన్నికల సమయానికి 80 శాతం స్టాండర్డ్‌గా నిలబడదని పేర్కొన్నారు. ఈ విషయంలో రియలటైమ్ గవర్నెన్స్(ఆర్‌టీజీఎస్) సేవలు మరింత చేరువ కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. దీని బాధ్యతలు పూర్తిగా ఉన్నతాధికారులవేనని.. దీనిలో రాజకీయ నేతల జోక్యం ఉండదని కూడా చంద్రబాబు వివరించారు.

## ఘనంగా ఉప్పులూరి లక్ష్మీనారాయణ 75 వ జన్మదిన వేడుకలు



**విజయవాడ పశ్చిమ, అక్టోబర్ 23 : (వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రముఖ రచయిత ఉప్పులూరి లక్ష్మీనారాయణ 75 వ జన్మదిన వేడుకలు గురువారం సాయంత్రం ఉండవల్లిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రముఖులు పూల మాలలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పులూరి లక్ష్మీనారాయణ రచించిన జీవన్ముక్తికి సోపానం కాశి క్షేత్రం పద్యశతక గ్రంధావిష్కరణ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ స్వాతంత్ర సమరయోధుల వారసుల సంఘం ప్రధాన కార్యదర్శి రాంపిళ్ళ జయ ప్రకాష్, డాక్టర్ చెట్లపల్లి మారుతి ప్రసన్న, ద్విశతావధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ,డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ ట్రస్ట్ అధ్యక్షులు బ్రహ్మదేశం వసంత కుమార్, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, దివాకర్ల నందకిషోర్, కుప్పా గోపాలకృష్ణ శర్మ , పి. జానకి, దివాకర్ల విజయలక్ష్మి, అన్నపూర్ణ తదితరులు మాట్లాడుతూ ఉప్పులూరి లక్ష్మీనారాయణ సాహిత్య లోకానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు.

## నాగుల చవితి ఏర్పాట్లు పరిశీలన.



**మోపిదేవి: అవనిగడ్డ: అక్టోబర్ 23(వార్తాప్రభ ప్రతినిధి)**నాగుల చవితి పండుగ సందర్భంగా మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఏర్పాట్లను ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద రావు , ఎస్ఐ సత్యనారాయణ ఆలయ సూపరింటెంట్ అచ్యుత మధుసూదన్ రావు పర్యవేక్షించారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు

## గర్వకారణం



చేయి చేయి కలిస్తే చప్పట్లు
మనసు మనసు కలిపితే
ముచ్చట్లు
కష్టపడి పనిచేస్తే దూరమగు
బ్రతుకుల్లో ఆర్థిక ఇక్కట్లు
విజ్ఞాన జ్యోతి వెలిగిస్తే
తొలగును అజ్ఞానపు చీకట్లు
ఎదుర్కో వచ్చు సాహసిస్తే
జీవిత సాగరాన ఆటుపోట్లు
జీవితమన్నది అమూల్యమైనది
ఏది ఇచ్చినా సమముకానిది
కాకూడదోయ్! అతలాకుతలము
చేసుకోవాలి సద్వినియోగము
మాటయిస్తే కట్టుబడి ఉండాలి
అడ్డంకులు వచ్చినా నిలబడాలి
అదే కదా స్ఫూర్తికి నిదర్శనము
జీవితాల్లో గర్వకారణము

-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు, సెల్:9966414580.

# ఔట్ ఫాల్ డ్రైన్ లో వర్షపు నీరు ప్రవాహం డ్రోన్ తో పరిశీలన

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఔట్ ఫాల్ డ్రైన్ లో వర్షపు నీరు ప్రవాహం డ్రోన్ తో పరిశీలించారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా టిక్కిలి రోడ్డు, మదర్ తెరిసా జంక్షన్, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డు, లయోలా కాలేజ్ రోడ్డు, ఈఎస్ఐ హాస్పిటల్ జంక్షన్, ఇన్నర్ రింగ్ రోడ్, 33 తూముల సెంటర్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో వర్షపు నీరు ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డీసిల్టింగ్ పనులు ఎప్పటికప్పుడు జరుగుతుండాలని, కల్వర్ట్ ల వద్ద ప్రత్యేకంగా దృష్టి పెట్టి వ్యర్థాలను తొలగించాలని, కల్వర్టను పూర్తిస్థాయిలో మెయింటెనెన్స్ చేయాలని, 33 తుమ్ముల వద్ద గుర్రపు డెక్కలను తొలగించాలని, ఈఎస్ఐ జంక్షన్ వద్ద కిందకున్న కల్వర్టును లెవెల్ పెంచమని, ఔట్ ఫాల్ డ్రైన్ ను డ్రోన్ తో పరిశీలించి, ఎప్పటికప్పుడు డీసిల్టింగ్ చేసుకుంటూ, వర్షపునీటి ప్రవాహంలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదుపరి ధర్నా చౌక్ వద్దగల అన్న కాంటీన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతిరోజు నిర్దేశిత సమయానికి అన్నా క్యాంటీన్ ను తెరుస్తున్నారా, ఆహారంలో నాణ్యత ఉంటుందా, పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంటుంది, త్రాగునీరు అందుబాటులో ఉంటుందా వంటి అంశాలను అక్కడ వచ్చిన ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. ఇంకా అన్న క్యాంటీన్ మెరుగుదలకు వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రతిరోజు క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి వారి అభిప్రాయాలను తెలపాలని వారిని కోరారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

# లక్ష్మీ నాయుడు కుటుంబానికి ప్రభుత్వ సాయంపై ఏబి వెంకటేశ్వరావు వ్యాఖ్యలు సరి కాదు

**కాపు సామాజిక వర్గ ప్రముఖులు ఆకుల శ్రీనివాస్ విమర్శ**



**విజయవాడ పశ్చిమ, అక్టోబర్ 23: (వార్తా ప్రభ ప్రతినిధి)**అమానుష హత్యకు గురైన తిరుమల శెట్టి లక్ష్మీనాయుడు కుటుంబానికి కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం పై మాజీ పోలీసు అధికారి ఏబి వెంకటేశ్వరరావు వ్యాఖ్యలు దారుణమని కాపు సామాజిక వర్గ ప్రముఖులు ఆకుల శ్రీనివాస్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. దారుణ హత్యకు గురైన లక్ష్మీనాయుడు కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆదుకోవడం తప్పు అనేలా ఆయన మాట్లాడడం చూస్తే కాపు సామాజిక వర్గం పట్ల ఏ బి వెంకటేశ్వరరావు వైఖరి ఎలా ఉందో అర్థమవుతుందని ధ్వజమెత్తారు. ఇటువంటి వ్యాఖ్యానాలు చేసే ముందు లక్ష్మీనాయుడు హత్యోదంతం విషయంలో ప్రభుత్వం గానీ సామాజిక వర్గం గానీ ఎలా స్పందించిందో చూడాల్సిన అవసరం ఉందని ఆకుల శ్రీనివాస్ స్పష్టం చేశారు. కులాల మధ్య ఎటువంటి విభేదాలు చెలరేగకుండా చూసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, విభేదాలను రెచ్చగొట్టేలా ఏ బి వెంకటేశ్వరరావు వ్యాఖ్యలు చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. రెండు సామాజిక వర్గాల తో ముడిపడి ఉన్న సున్నితమైన అంశం పట్ల స్పందించాల్సిన తీరు ఇది కాదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పోలీసు శాఖలో ఎంతో ఉన్నతమైన పదవిలో ఉండి రిటైర్ అయిన ఏబి వెంకటేశ్వరరావు కేవలం పోలీసు దృక్కోణం తోనే ఈ కేసును చూడడం సరికాదని ఆకుల శ్రీనివాస్ విమర్శించారు. రాష్ట్రంలో ఏటా 900 వరకు హత్యలు జరుగుతున్నాయని వాటన్నింటికీ ఇలానే నష్టపరిహారం ఇస్తూ పోతారా అంటూ అర్థంపర్థం లేకుండా మాట్లాడడం కులాల మధ్య కుంపట్లను రాజేయడమే అవుతుందని ఆకుల శ్రీనివాస్ విమర్శించారు. ఎంతో బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ రిటైర్ అయిన వ్యక్తి ఎడాపెడా ఎలా పడితే అలా మాట్లాడడం సరికాదని ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు కు ఆత్మీయ సత్కారం.




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నెల్లూరు జిల్లా , ఆత్మకూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మి లక్ష్మయ్య నాయుడు కు భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో ఆత్మీయ స్వాగతం పలికి దుస్సాలువతో సత్కరించారు. ఆయన గురువారం భవానిపురం ఎన్డీఏ కార్యాలయానికి విచ్చేయగా ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, టీడీపీ నాయకులు పీ వీ చిన సుబ్బయ్య, పత్తి నాగేశ్వరరావు తదితరులు కొమ్మి లక్ష్మయ్యకు ఆత్మీయ స్వాగతం పలికారు పుష్పగుచ్ఛం అందజేసి దుస్సాలువతో సత్కరించారు . ఈ సందర్భంగా కొమ్మి లక్ష్మయ్య మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారని ఆత్మకూరునియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చానన్నారు ,మౌలిక సదుపాయాలను కల్పన కోసం కృషి చేశానని తెలిపారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి పశ్చిమ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్నారన్నారు . భవానిపురంలో నెల్లూరు, ప్రకాశం జిల్లా వాసులందరూ సోదర భావంతో ఉంటూ కూటమి బలోపేతానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. టిడిపి నేతలతో ముఖాముఖి మాట్లాడి పలు విషయాలను వారితో పంచుకున్నారు.

# స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లా అండర్-19 పోటీల్లో ప్రతిభను చాటుతున్న విద్యార్థిని విద్యార్థులు

● రెజ్లింగ్ ఫ్రీస్టైల్, గ్రీకో రోమన్ ఓవరాల్ చాంపియన్ నెల్లూరు జిల్లా ● క్రీడలు మరియు ఆటలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి గణనీయంగా దోహదపడతాయి ● రాష్ట్ర ఎంఈఓల సంఘం అధ్యక్షుడు వెంకట రత్నం



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ రూరల్ మండలం నున్నలోని అశోక ఫంక్షన్ హాల్‌లో గురువారం ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–19 బాలుర అంతర్ జిల్లాల కుస్తీ ఛాంపియన్‌షిప్‌లో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు (ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు) జిల్లా ఫ్రీస్టైల్ మరియు గ్రీకో–రోమన్ విభాగాలలో రెండు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లను గెలుచుకుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌జీఎఫ్ఏపీ), సమగ్ర శిక్ష (ఎస్ఎస్), ఎన్‌టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ మూడు రోజుల పాటు ఈ టోర్నమెంట్‌ను నిర్వహించింది. నెల్లూరు జిల్లా క్రీడాకారులు ఈ టోర్నమెంట్ అంతటా అద్భుతమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. ఫ్రీస్టైల్ విభాగంలో, ఆ జట్టు నాలుగు బంగారు పతకాలు, రెండు రజత పతకాలను గెలుచుకోవడం ద్వారా 26 పాయింట్లు సాధించగా, గ్రీకో–రోమన్ విభాగంలో మూడు బంగారు పతకాలు, మూడు కాంస్య పతకాలతో 18 పాయింట్లు సాధించి, రెండు ఫార్మాట్లలో రెండు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మండల విద్యా అధికారుల సంఘం (ఏపీఎంఈఓఏ) అధ్యక్షుడు, విజయవాడ రూరల్ ఎంఈఓ ఎ. వెంకట రత్నం ముఖ్య అతిథిగా హాజరై వ్యక్తిగత విజేతలకు పతకాలను ప్రదానం చేయడంతోపాటు నెల్లూరు జిల్లా బృందానికి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకట రత్నం మాట్లాడుతూ, క్రీడలు, ఆటలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, వారిని ఆరోగ్యంగా, క్రమశిక్షణతో, ప్రేరణతో ఉంచడానికి గణనీయంగా దోహదపడతాయని నొక్కి చెప్పారు. విజయవాడ రూరల్ మండల పరిధిలోని కీలక గ్రామాలలో ఒకటైన నున్నలో ప్రతిష్టాత్మక రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు నిర్వాహకులను ఆయన ప్రశంసించారు. పానిపట్‌లో జరగనున్న అండర్–19 స్కూల్ గేమ్స్ నేషనల్స్‌లో బంగారు పతకాల కోసం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైన రెజ్లర్లను ఆయన ప్రోత్సహించారు. అలాగే, మ్యాచ్‌ల్లో ఓడిపోయిన వారు విజేతల అనుభవాల నుండి నేర్చుకుని భవిష్యత్ ఈవెంట్లలో మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని ఆయన సూచించారు. జడ్పీహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూరపనేని రవి ప్రసాద్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, ఎస్ఎంసీ చైర్మన్ జీ కుమార్, ఏపీ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ భూషణం, ఎస్‌జీఎఫ్ పరిశీలకుడు చిటికిన రమేష్, టెక్నికల్ ఇన్‌చార్జ్ పీ ఆనంద్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి టీ శ్రీ లత, ఫిజికల్ డైరెక్టర్లు టీ విజయ వర్మ, ఎంవీ సత్య ప్రసాద్, ఎస్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రైళ్లు ఆగకపోవడంపై బీజేపీ నేతల ఆరా!



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి రైల్వే స్టేషన్ లో గత నాలుగు రోజుల నుంచి రైళ్లు ఆగకపోవడంతో బీజేపీ నేతలు ఆరా తీశారు. గురువారం స్టేషన్ అధికారులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి మరమ్మతు పనుల దృష్ట్యా నవంబర్ 18 వరకు రైళ్లకు హాల్టింగ్ లేదని తెలిపారు. 19 నుంచి కచ్చితంగా రైళ్లు ఆగేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి, బొర్రా ప్రవీణ్, సేనాపతి నాగమణి, కూనాల యుగంధర్, దాము భవానీ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా వైసీపీ బి సి ప్రధాన కార్యదర్శి గా కొరగంజి సత్యనారాయణ నియామకం



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి జోగి రమేష్ ఆధ్వర్యంలో వైయస్ జగన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ (ఎమ్మెల్సీ ) తలశీల రఘురాం ఆశీస్సులతో ఎన్టీఆర్ జిల్లా బీసీ జనరల్ సెక్రటరీగా కొరగంజి సత్యనారాయణ నియమితులైయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ కార్యాలయం లో కొరగంజి సత్యనారాయణ ని వైసీపీ నాయకులు సత్కరించారు. అదేవిధంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను ప్రైవేటుపరం కాకుండా అడ్డుకునేందుకు మైలవరం నియోజకవర్గం మాజీ మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని వివిధ అనుబంధాల అధ్యక్షులు ,మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, పార్టీ నాయకులు ,కార్యకర్తలు అందరూ కలిసి కోటి సంతకాల ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ప్రతిన బూనారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండలం అధ్యక్షుడు బయ్యార పరువు కిషోర్ , వడ్డెర సంఘం నాయకుడు చల్లా అర్జున్ , , మైలవరం నియోజకవర్గం మైనారిటీ విభాగం అధ్యక్షుడు షేక్ గౌస్,, వాలంటరీ విభాగం అధ్యక్షుడు టి.ఎల్. రాజు, సీనియర్ నాయకులు సింహచలం ,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## "ఐష్టా" టెన్నిస్ టోర్నమెంట్ లో వి ఎమ్ సి ఉద్యోగి ఛాంపియన్



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఈ నెల 13 నుండి 17 వ,తేదీ వరుకు ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం లో జరిగిన ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్లో 35ం డబుల్స్ విభాగంలో విజయవాడ కార్పొరేషన్ ఎస్టేట్ సెక్షన్ లో పనిచేస్తున్న అడ్మిన్ సెక్రెటరీ రామకూరి రాంబాబు మహేష్ తో (విజయనగరం) జోడి కలిసి డబుల్స్ టైటిల్ ను గెలుచుకున్నారు. రాష్ట్రస్థాయిలో మరియు జాతీయస్థాయిలో పలు టోర్నమెంట్ లో పాల్గొని విజయం సాధిస్తున్న అడ్మిన్ సెక్రెటరీ రామకూరి రాంబాబు ని విజయవాడ నగర మున్సిపల్ కమిషనర్ ధ్యాన్చంద్ర హెచ్.యమ్. ఐ.ఏ.ఎస్ అభినందించారు.

## పీ 4 ద్వారా మహిళకు చేయూత

**సుజనా ఫౌండేషన్ ద్వారా కుట్టు మిషన్ అందజేత**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నిరుపేద కుటుంబానికి చెందిన మహిళ చల్లా మౌనిక కు భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో కుట్టు మిషన్ అందజేశారు. బ్యాంకు సెంటర్ లో నివాసముంటున్న చల్లా మౌనిక తన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాలేదని జీవనోపాధి నిమిత్తం కుట్టు మిషన్ అందజేయాలని ఎన్డీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పీ 4 లో భాగంగా, సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ 5,500 విలువచేసే ఉష కుట్టు మిషన్ ను కూటమి నేతలతో కలిసి ఎన్డీఏ కార్యాలయంలో అందజేశారు. చేయూతనిచ్చిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి లబ్ధిదారు చల్లా మౌనిక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 40 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పీ వీ చిన సుబ్బయ్య, 42 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పత్తి నాగేశ్వరరావు, యంగ్ ప్రొఫెషనల్ కాకర్ల ప్రేమ్ దీప్, కూటమి నేతలు గంగవరపు సురేష్, రవి, మన్నెం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్సిసి తో విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందుతుంది.

**- కె.బి.ఎన్. కాలేజీలో ఎన్ సిసి కేడెట్ల ఎంపిక ప్రక్రియను పరిశీలించిన లెఫ్టినెంట్ కల్నల్ అజిత్ సింగ్ తోమర్**



**విజయవాడ పశ్చిమ, అక్టోబర్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)** విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు ఎన్సిసి దోహదపడుతుందని 17 వ ఆంధ్ర బెటాలియన్ ఎన్ సిసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ అజిత్ సింగ్ తోమర్ చెప్పారు. కె.బి.ఎన్ ఎన్ సిసి ఫస్ట్ ఇయర్ ఎన్ సిసి విద్యార్థుల ఎంపిక ప్రక్రియను అయన పరిశీలించారు. ఈ సందర్శన సందర్భంగా ఆయన ఎంపిక ప్రక్రియకు చేసిన ఏర్పాట్లను సమీక్షించి, ఎన్ సిసి స్టోర్ రూమ్, ఇన్‌స్ట్రక్షన్ రూమ్, కళాశాల ఇతర సౌకర్యాలను పరిశీలించారు. అదనంగా, కొత్తగా ఎంపికైన కేడెట్లతో ఆయన ముచ్చటించారు. శారీరక పరీక్ష, లిఖిత పరీక్ష ఆధారంగా క్యాడేట్ లను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ మొత్తం ఎంపిక కార్యక్రమాన్ని కెప్టెన్ కె. పి. టీ. విజయభాస్కర్ సమన్వయం చేసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కె పి వి హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. వి. నారాయణరావు, ప్రిన్సిపాల్ డా. జి. కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పి ఎల్ రమేష్, కె. రామకృష్ణ, 17 ఆంధ్ర బెటాలియన్ ఎన్ సిసి సిబ్బంది సుబేదార్ ఆర్. కె. పాండా, సుబేదార్ ఎస్. కె. మూర్తి, హవిల్దార్ నేత్ర గురుంగ్, జి.సి.ఐ. సిహెచ్. సత్యవేణి, హవిల్దార్ బల్విందర్ కుమార్ పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభారీ అధికారి ఎన్ అశోక్ బాబు బృందం సుడిగాలి పర్యటన..





**పెనుగంచిప్రోలు, అక్టోబర్ 23( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు, గ్రామంలో గురువారం కేంద్ర ప్రభారీ అధికారి ఎన్ అశోక్ బాబు బృందం ఉదయం 10 గంటల నుండి సుడిగాలి పర్యటన చేశారు. పెనుగంచిప్రోలు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను అంగన్వాడి కేంద్రాలను పశు వైద్య కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో నీతి అయోగ్ ప్రతిపాదనలో జిల్లాలో పెనుగంచిప్రోలు ఇబ్రహీంపట్నం మండలాలు వెనకబడి ఉన్నాయని దీనిలో భాగంగా మండలంలో 40 సూచికలు అధికారులు అమలు పరిచేలా అధికారులకు అవగాహన కల్పించామని ఆంధ్రప్రదేశ్లో మొత్తం 15 వెనకబడిన మండలాలను గుర్తించామని మండలాలు అభివృద్ధి పరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచన చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ డివిజన్ ఆర్డీఓ బాలకృష్ణ. జిల్లా డి ఎం హెచ్ వో సుహాసిని. ఎండిఓ జి శ్రీ ను తహసీల్దార్ శాంతిలక్ష్మి శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి దేవస్థానం ఈవో కిషోర్ కుమార్ గ్రామ సర్పంచి వేల్పుల పద్మ కుమారి జడ్పిటిసి సభ్యురాలు ఊ ట్ల నాగమణి ఎంపీపీ మర్కపూడి గాంధీ గ్రామ సెక్రెటరీ శ్యాం కుమార్ మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్ వైస్ ఎంపీపీ గుంటుపల్లి.వాసు మండల సమైక్య అధ్యక్షురాలు కర్లకోటేశ్వరి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి సతీష్ ఎంపీటీసీ సభ్యులు కాకాని స్రవంతి. జంగం వీరమ్మ చాట్ల సుశీల. జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు జలజ గర్ల్స్ స్కూల్. ప్రధానోపాధ్యా యులు నక్క బాబురావు. ప్రాథమిక ఆరోగ్యశాఖ హాస్పటల్ డాక్టర్ నాగరాణి. గ్రామపంచాయతీ వార్డు మెంబర్స్ వివిధ శాఖల అధికారులు ఈకార్యక్రమంలోరాజకీయాలకతీతంగా ప్రతి ఒక్క రాజ కీయ పార్టీ ల నాయకులు మహిళలు గ్రామ పెద్దలు అందరూ పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాన్ని పర్యవేక్షించిన కేంద్ర ప్రభారీ అధికారి అశోక్ బాబు.....



**పెనుగంచిప్రోలు, అక్టోబర్ 23(: వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు లోని అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం కేంద్ర ప్రభారీ అధికారి కేంద్ర జల సంఘం డైరెక్టర్ అశోక్ బాబు పర్యటించారు. జిల్లాలోని ఆ కాం క్షిత బ్లాక్ కార్యక్రమం ( ఏ బీ పి )కింద వున్న ఈ గ్రామాన్ని సందర్శించారు. అంగన్వాడీ కేంద్రం లో చిన్నారు ల తో మాట్లడి మధ్య హ్న భోజన పథకాన్ని పరిశీలించి న ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స మై ఖ్య అధ్యక్షురా లు కర్ల కోటేశ్వరి సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి తహసీల్దార్ శాంతి లక్ష్మి జిల్లా పంచాయతీ అధికారి లావణ్య అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్య వైశ్య ప్రముఖులు పెద్ద బ్రాహ్మం అనారోగ్యంతో మృతి



పెనుగంచిప్రోలు, అక్టోబర్ 23( వార్త ప్రభ ): పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన మండల ఆర్యవైశ్య ప్రముఖులు వంగవీటి పెద్ద బ్రహ్మానందం( 82) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. వీరి సతీమణి అరుంధతి కూడా ఇటీవల కాలంలోనే స్వర్గస్తులైనారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరి కుమారుడు వంగవీటి మల్లిబాబు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడుగా, ఆర్యవైశ్య ప్రముఖులుగా ఉన్నారు. కాగా వీరి మృతి పట్ల జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య ) మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, సహకార సంఘం అధ్యక్షులు కర్ల వెంకటనారాయణ, దేవస్థానం మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవరావు, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారు కోరారు.

## భారీ వర్షాలకు తక్షణ చర్యలు...



**గుడ్లవల్లేరు:అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కురుస్తున్న భారీ వర్షాలకు గుడ్లవల్లేరు మండలంలోని ప్రతి పంచాయితీలో అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ గురువారం ఆదేశించారు. భారీ వర్షాలను పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడిందన్నారు. ఈ కంట్రోల్ రూమ్లో ఆరుగురు పంచాయతీ కార్యదర్శులను నియమించినట్లు తెలిపారు. 24గంటలు డ్యూటీలో ఉండి మండల పరిధిలో వర్షాలతో రహదారులు, గ్రామ పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగితే సంబంధిత అధికారులకు సమాచారం అందజేయుట జరుగుతుందన్నారు. మండల పరిధిలో ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో గ్రామ ప్రజలు గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయ కంట్రోల్ రూమ్ను సంప్రదించగలరని కోరారు.

**రోడ్లపై వర్షపునీటి తొలగింపు...**వర్షాల కారణంగా గుడ్లవల్లేరు గ్రామంలో వర్షపు నీరు రోడ్లపై చేరి ప్రజలు రాకపోకలకు ఆటంకం కలుగుటచే ఆ నీటిని పారిశుధ్య కార్మికులు గురువారం తొలగించారు. గ్రామ పంచాయతీ జె.ఎల్.నరసింహారావు ఆదేశాల మేరకు శానిటరీ ఇన్స్పెక్టర్ పవన్కుమార్ పర్యవేక్షణలో వర్షపు నీటిని డ్రైనేజీలోకి ప్రవహించినట్లు పారిశుద్ధ కార్మికులు కార్మికులచే చేయించారు.

## పేద ప్రజల ఆకలి తీర్చిన...... చిలకలపూడి పి.ఎస్ఐ చందన, స్వచ్ఛంద సేవ సంస్థ ఆకూరి శ్వేత.



**మచిలీపట్నం అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మచిలీపట్నం నగరమంతా నీటిమయమైంది. రోడ్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఉదయం నుంచి కొన్ని హోటల్లు, క్యాంటీన్లు వర్షానికి మూతపడ్డాయి. రోజువారి కూలి పనులు చేసుకునే కూలీలు ఇంటికి పరిమితమయ్యారు. రోడ్డు పక్కన నివసించే సంచార జాతుల వారికి సరైన ఇల్లు లేక గురువారం కురిసిన భారీ వర్షానికి ఇంటితో సహా వస్తువులన్నీ తడిసి ముద్దయ్యాయి. ఉదయం నుండి ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి కొంతమంది పేద ప్రజలకు ఇంటిలో సరైన సదుపాయాలు లేకపోవటంతో వంట చేసుకునే పరిస్థితి లేక దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు. ఈడేపల్లి, నారాయణపురం, బైపాస్ రోడ్ లోని సంచార జాతుల వారి రోజువారి జీవనానికి వర్షం తో ఆటకం ఏర్పడింది. డబ్బులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది. వీరి ఆకలి, బాధలను తెలుసుకున్న స్వచ్ఛంద సేవా సంస్థ ఆకూరి శ్వేత, చిలకలపూడి పోలీస్ స్టేషన్ పి.ఎస్.ఐ చందన ఇరువురు స్వచ్ఛందంగా తమ సొంత డబ్బులతో ఆహారాన్ని తయారు చేయించి రోడ్డు పక్కన నివసించే నిరుపేద సంచార జాతుల వారికి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. దీనితో ఆ పేద ప్రజల ఆకలి తీరింది. పేద ప్రజల ఆకలిని తెలుసుకున్న శ్వేత, ఎస్సై చందన వర్షంను లెక్కచేయకుండా వర్షపు నీటిలో వారికి ఆహార పొట్లాలు పంపిణీ చేసి వారి ఆకలిని తీర్చారు. ఈ సందర్భంగా నిరుపేద ప్రజలకు ఆహార పొట్లాల పంపిణీ పై నగరంలోని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఇలానే పేద ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు.

## రూ.6 కోట్లతో వాడపల్లి క్షేత్రానికి ఏటిగట్టు రోడ్డు

**● నిధులు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ● కొత్తపేట శాసన సభ్యులు బండారు సత్యానందరావు అభ్యర్థనకు తక్షణ స్పందన ● భక్తుల సౌకర్యార్ధం 7 కిలోమీటర్ల మేర ఏటిగట్టు రహదారి నిర్మాణం**



**విజయవాడ, అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కోనసీమ తిరుమలగా పేరొందిన పవిత్ర పుణ్యక్షేత్రం వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి 216వ నంబర్ జాతీయ రహదారి నుంచి గోదావరి గట్టు మీదుగా నేరుగా చేరుకునేందుకు వీలుగా నూతన రహదారి నిర్మాణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆమోదం తెలిపారు. రూ.6 కోట్లు పంచాయతీరాజ్ నిధులు మంజూరు చేశారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే వాడపల్లి క్షేత్రానికి రాకపోకలు సాగించే భక్తుల ప్రయాణ కష్టాలు తీరతాయి. గురువారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో కొత్తపేట శాసన సభ్యులు బండారు సత్యానందరావు పవన్ కళ్యాణ్ ని కలిసి వాడపల్లి ఏటిగట్టు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పేరున్న వాడపల్లి ఏడు వారాల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి రోజు రోజుకీ భక్తుల రద్దీ పెరుగుతూ వస్తోందని, రావులపాలెం మీదుగా ఉన్న ప్రస్తుత రహదారి ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ రద్దీతో భక్తులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. 216 జాతీయ రహదారి నుంచి ఏటిగట్టు మీదుగా 7 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తే.. ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించి తక్షణం నిధులు మంజూరు చేశారు. ఈ రోడ్డుని అభివృద్ధి చేస్తే భక్తులు గోదావరి తీరాన ప్రయాణించడం ద్వారా ఆధ్యాత్మిక పర్యాటకం అభివృద్ధి చెందుతుందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు.

## ఉత్సాహంగా జిల్లా యువజనోత్సవాలు





**విజయవాడ, అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అద్భుత ప్రదర్శనలు, ఆకట్టుకునే నృత్యాలు, యువత కేరింతల మధ్య ఎన్టీఆర్ జిల్లా యువజనోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. యువజన సర్వీసుల శాఖ, స్టెప్, క్రిషి ఆధ్వర్యంలో విజయవాడ కేబీఎన్ కళాశాలలో గురువారం జరిగిన ఎన్టీఆర్ జిల్లా యువజనోత్సవాలకు విజయవాడ ఆర్డీఓ కె. చైతన్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... యువత తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి యువజనోత్సవాలు మంచి వేదికన్నారు. జిల్లా యువత.. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో బహుమతులు సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు ఎన్టీఆర్ జిల్లా యువజన సంక్షేమాధికారి %డ% ముఖ్య కార్యనిర్వహణాధికారి యు. శ్రీనివాసరావు మాట్లాడుతూ... జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన వారికి, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ప్రతి ఏటా జనవరి నెలలో న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయస్థాయి యువజనోత్సవాలలో పాల్గొనే అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన వివిధ కళాశాలల విద్యార్థులు బృందగానం, నృత్యం, చిత్రలేఖనం వంటి అంశాలలో పోటీపడ్డారు. అద్భుత ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. అబ్బురపరిచే ప్రదర్శనలను చూసి యువత కేరింతలు కొట్టారు. జానపద గీతాల విభాగంలో ఎం. సింధు రాజేశ్వరి బృందం మొదటి స్థానంలో నిలవగా, టి.కిరణ్ బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. జానపద నృత్యం విభాగంలో విష్ణుష్ కార్తికేయ బృందం మొదటి బహుమతిని, కౌశిక్ బృందం రెండో బహుమతిని దక్కించుకున్నాయి. సైన్స్ మేళలో కే అఖిల బృందం తొలి స్థానంలో, సిహెచ్. హాసిని బృందం ద్వితీయ స్థానంలో నిలిచాయి. స్టోరీ రైటింగ్ లో కే. బాల మణి ప్రసాద్ ప్రథమ బహుమతిని, కె.ప్రదీప్ కుమార్ ద్వితీయ బహుమతిని పొందారు. పోయెట్రీలో ఎం. శ్రీలేఖ, వి. వర్షిణి మొదటి,రెండు స్థానాలు పొందగా, చిత్రలేఖనంలో డి. సుధీక్ష, ఎం. శ్రీ వైష్ణవి, డిక్లమేషన్లో కే.శ్రావణి, ఎస్కే. నదియా ప్రథమ ద్వితీయ బహుమతులు పొందారు. విజేతలకు విజయవాడ ఆర్డీఓ కే.చైతన్య, మై భారత్, యూత్ ఆఫీసర్ సుంకర రాము మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేబీఎన్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపల్ జి.కృష్ణవేణి, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ టి. శ్రీనివాస్, స్టెప్ క్రిషి మేనేజర్ డి.సుబ్బారావు, యువజన సర్వీసుల శాఖ ఫీల్డ్ ఆఫీసర్ అభిజ్ఞాన్, సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## పాడేరు చెరువు తూము పరిశీలన



**చేజర్ల అక్టోబర్ 23 (వార్తాప్రభ)** మండలంలోని పాడేరు చెరువు నీరు తూము గుండా వృధాగా పోతున్న నీరుని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ప్రత్నమయంగా నీటిని అరికట్టేందుకు యుద్ధ ప్రాతిపదికన వృధాగా పోవుచున్న నీరుని అరికడతామని ఇరిగేషన్ ఈఈ రవికుమార్ ఇరిగేషన్ డిఈ సురేష్ ఇరిగేషన్ ఏఈ యాసిన్ ఇరిగేషన్ ఏఈ బాలసుబ్రమణ్యం పరిశీలించి గురువారం తెలియజేయడం జరిగినది. సదరు అధికారుల వెంట పాడేరు చెరువు అధ్యక్షులు స్వర్ణ రాంప్రసాద్ పాడేరు చెరువు వైస్ ప్రెసిడెంట్ యరగర్ల మనోహర్ 24 ఎల్ సోమశిల కాలువ అధ్యక్షులు ఉడత హజరత్తయ్య పాడేరు సర్పంచ్ గుమ్మ వెంకటేశ్వర్లు ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

## కృష్ణాజిల్లాలో భారీ వర్షపాతం నమోదు.

**సరాసరి వర్షపాతం 34.4 మిల్లీమీటర్లు.**

**అత్యధికముగా మచిలీపట్నం 112.6 ఎంఎం**



**మచిలీపట్నం అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణాజిల్లాలో ఉన్న 25 మండలాలలో రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. అత్యధికముగా మచిలీపట్నం 112.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నాగాయలంకలో 76.8%ఎ% కురిసింది. అత్యల్పంగా పెద్ద పారుపూడి మండలాలలో 11 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలలో పలు మండలాల్లో కురిసిన వర్షాపాతం వివరాలు మిల్లీమీటర్లలో మచిలీపట్నం 112.6,నాగాయలంక 76.8, బంటుమిల్లి 56.2, ఘంటసాల 54.2, గుడివాడ 46.4, మొవ్వ 44.8, చల్లపల్లి 40.2, అవనిగడ్డ 38.2, మోపిదేవి 37.4, కృత్తివెన్ను 24.8, గూడూరు 22.6, పెడన 20.6, గన్నవరం 20.2, ఉయ్యూరు 19.8, పామర్రు 18.6, పమిడిముక్కల 18.6, తోట్లవల్లూరు 17.0, కోడూరు 16.6, నందివాడ 15.4

## మూలపాడు గ్రామ టిడిపి అధ్యక్షుడిగా మూరకొండ



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 23(వార్తా ప్రభ ప్రతినిధి):**మండల పరిధిలోని మూలపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు మూరకొం నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం నాడు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు నాగేశ్వరావు. నాగేశ్వరావు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యే వసంత. గ్రామంలో ఎటువంటి వర్గ విభేదాలకు తావు రాకుండా పార్టీని ముందుకు నడపాలని సూచించారు ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో మూలపాడు సొసైటీ చైర్మన్ గరికపాటి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు గంజి నరసింహారావు,మాకాని వెంకాయమ్మ, మాజీ అధ్యక్షులు కాకి నాగరాజు, పెసల రమేష్ ,కోమటి తిరుపతిరావు,నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గంజి ఏసుబాబు, కలకంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రగతి కోసం చంద్రబాబు లోకేష్ లు కృషి చేస్తున్నారు - ముప్పిడి నాగేశ్వర రెడ్డి

**రెడ్డిగూడెం అక్టోబర్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశలో జరుగుచున్న కార్యక్రమాలపై ముప్పిడి నాగేశ్వర రెడ్డి స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రగతిని లక్ష్యంగా పెట్టుకొని, చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబులు కృషి చేస్తున్నారు అని నాగేశ్వర రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక మరియు వ్యవసాయ రంగాలను సమర్థవంతంగా అభివృద్ధి చేయడం కోసం చంద్రబాబు లోకేష్ బాబులు చర్యలు తీసుకుంటున్నారని ముప్పిడి నాగేశ్వర రెడ్డి తెలిపారు. ఇలాంటి కృషి వల్ల ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, ప్రజల జీవన స్థాయి మెరుగుపడుతుందని ఆయన వెల్లడించారు. ముప్పిడి నాగేశ్వర రెడ్డి అభిప్రాయం ప్రకారం, ఈ విధమైన నిరంతర నాయకత్వం మరియు పెట్టుబడులు.. రాష్ట్రాన్ని ప్రగతి దిశగా, ఆధునిక ఆర్థిక కేంద్రంగా మార్చడానికి దోహదం చేస్తుంది. ప్రజలు కూడా ఈ ప్రయత్నాలను స్వాగతిస్తూ, ప్రభుత్వ చర్యలకు సహకారం ఇవ్వడం అవసరమని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో పలువురు టీడీపి నాయకులు పాల్గొన్నారు.



## అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 23 (వార్తాప్రభ):**వివిధ ప్రాంతాల్లో విద్యుత్ వైర్లను చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను మియాపూర్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్దనుంచి పోలీసులు రూ. 4 లక్షల విలువైన 81 విద్యుత్ వైర్ల బేండళ్లను,దొంగతనాలకు ఉపయోగించిన మారుతి స్విఫ్ట్ కారు,బజాజ్ పల్సర్ బైకును స్వాధీనం చేసుకున్నారు. మియాపూర్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మియాపూర్ ఏసీపీ ఈ వివరాలను వెల్లడించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన దీలిప్ కుమార్, హఫీజ్ పేట్ లో నివాసముంటున్న నిశాల్ కర్లుర్ స్నేహితులుగా ఏర్పడి దొంగతనాలకు అలవాటు పడ్డారు. వీరిద్దరూ జల్సాల కోసం డబ్బు సంపాదించేందుకు ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులు మొదట పగటిపూట నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద రెక్కీ నిర్వహించేవారు. ఆ తర్వాత రాత్రి సమయాల్లో కారులో వెళ్లి,భవనాల్లో నిల్వ చేసిన విద్యుత్ వైర్ల బేండళ్లను దొంగిలించేవారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు..

**-1బీసీ ఐక్యవేదిక తెలంగాణ అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్**




**హైదరాబాద్,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్రంలో బీసీల హక్కు అయినా రిజర్వేషన్ల సాధన పై చేస్తున్న ఉద్యమాన్ని అక్రమ అరెస్టులతో ఆపలేరని ఎంతటి వరకైనా పోరాడేందుకు సిద్ధంగా ఉంటామని బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాజ్ భవన్ ముట్టడికి వెళ్తున్న బీసీ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. అక్రమ అరెస్టులపై బేరి రామచంద్ర యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా చట్టం చేస్తే గవర్నర్ రాష్ట్రపతికి పంపకుండా అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వాలు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. రాజ్ భవన్ ముట్టడికి వెళ్తున్న బీసీ నాయకులను కేంద్రంలోని అధికార బిజెపి ప్రభుత్వం అడ్డుకునే కుట్ర చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ సాధించేవరకు పోరాటాలు కొనసాగిస్తామని ఎవరైనా అడ్డుపడాలని చూస్తే బీసీల ఓట్లతో గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. బీసీల రిజర్వేషన్లపై ప్రధాని మోదీ స్పందించాలని, తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బీసీ రిజర్వేషన్ చట్టం అమలయ్యేలా చూడాలన్నారు. అనంతరం బీసీ రిజర్వేషన్ 42 శాతం అమలు పై రాజభవన్ ముట్టడికి పోలీసులు అడ్డుకొని చందానగర్ పోలీస్ స్టేషన్ కు అక్రమంగా తరలించిన బీసీ ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామ్ చందర్ యాదవ్, సిపిఎం పార్టీ శేర్లింగంపల్లి సభ్యులు కొంగరి కృష్ణ ముదిరాజ్ అరెస్టును నిరసిస్తూ ఆందోళన చేపట్టారు.

# కమలాపురం పిఏసిఎస్ చైర్ పర్సన్ గా కొట్టే సురేష్



**పెడన,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** పెడన మండలంలో నే రాజకీయ చైతన్యవంతమైన గ్రామం కమలాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం( పి ఎ సి ఎస్ )చైర్మన్ గా కొట్టే సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీచేసారు.అలాగే సభ్యులుగా బొల్లా వెంకటేశ్వ రావు తాడిశెట్టి సూరయ్య నియమితులయ్యారు. కమలా పురం గ్రామానికి చెందిన సురేష్ 2019 ఐ సంవత్సరం నుంచి టీడీపీ లో కొనసాగుతున్నారు.దివంగత నేత సోషల్ వర్కర్ కొట్టె నాగబాబు కుమారుడే సురేష్, తనకు ఈ పదవి రావడానికి సహకరించిన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ పరిధిలోని రైతులకు తనవంతు సేవలు అందజేస్తానని ఈ సందర్భంగా సురేష్ వార్త ప్రభ ప్రతినిధికి తెలిపారు.



**నూజివీడు మండలం, రావిచెర్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఏఎంసి మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు మాతృ మూర్తి అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న నేపధ్యంలో, వారిని స్వయంగా కలిసి పరామర్శించి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటున్న రాష్ట్ర హౌసింగ్ మరియు సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి -నూజివీడు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :**

# చేయి...చేయి కలిపిన ఆటోడ్రైవర్లు...





**గుడ్లవల్లేరు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** అత్యంత మరమ్మతులకు గురైన ముదినేపల్లి - గుడ్లవల్లేరు రోడ్డుపై ఉన్న మోకాల్లోతు గోతుల్లోని వర్షపు నీటిని శ్రీ కనకదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్‌కు చెందిన ఆటో డ్రైవర్లు గురువారం తొలగించారు. జోరువానలో సైతం తమతో పాటు వాహన చోదకులకు ఆటంకంగా మారిన వర్షపునీటిని సమిష్టిగా తొలగించి సమాజం పట్ల తమకున్న సేవాతత్పరతను చాటుకున్నారు. ఈ గోతుల్లో వర్షపునీరు తిష్ట వేయటంతో లోతు ఎంత ఉందో తెలియని వాహన చోదకులు ఆ గోతుల్లో పడిపోయి తీవ్ర గాయాల పాలవుతున్నారు. ఒక వైపు ఉచిత బస్సు పథకంతో కిరాయిలు లేక తిప్పలు పడుతున్న ఆటో డ్రైవర్లకు మోకాలు లోతున ఉన్న రోడ్లు తమ ఆటోల రాకపోకలకు అగచాట్లు పట్టిస్తున్నాయి. గోరు చుట్టు మీద రోకటి పోటులా ఎడతెరిపి లేకుండా కొద్ది రోజుల నుంచి కురుస్తున్న కుండపోత వర్షాలతో ఆటో వర్కర్లకు జీవనోపాధి పూర్తిగా కరువైంది. కురుస్తున్న వర్షాలతో మోకాల్లోతులో ఉన్న రోడ్లపై గోతుల్లో వర్షపునీరు చేరుతుంది. రిపేర్లకు గురైన రోడ్లపై ఆ వర్షపునీటిని తొలగించకపోతే తమతో పాటు ప్రయాణికులకు ప్రమాదాలు వాటిల్లుతున్నాయని ఆటో డ్రైవర్లు అంటున్నారు. గుడ్లవల్లేరు - ముదినేపల్లి రోడ్డులో ప్రయాణం ప్రాణ సంకటంగా మారిందని ప్రయాణికులు కూడా వాపోతున్నారు. వాహన చోదకులకు తమ ప్రయాణంలో ప్రత్యక్ష నరకం కనబడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిందంటే రోడ్లపై గోతుల్లో వర్షపునీరు చేరి ఎంత లోతు ఉందో తెలియక వాహన చోదకులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. వెంటనే ఈ రోడ్డును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే ఈ రోడ్డును నిర్మాణం చేస్తున్న ప్రభుత్వ తీరు అగమ్య గోచరంగా ఉందని చెప్పటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. గుడ్లవల్లేరు నుంచి ముదినేపల్లి రోడ్డు పనులకు ప్రభుత్వం రూ2.50కోట్లను కేటాయించింది. ఆ రోడ్డు పనులను ప్రారంభించనున్నట్లు కొద్ది నెలల క్రితం అధికారులు తెలిపారు. కాని ఇంతవరకు ఆ పనుల నిర్వహణ జాడే లేకుండా పోయింది.

# పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లో స్వచ్ఛోత్సవ్ నిర్వహణ







**తిరుపతి(పి.ఐ.బి.),అక్టోబరు 23 (వార్తాప్రభ) :** మహిళలు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో నాయకత్వ పాత్ర పోషించాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సి బి సి) అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. రమేశ్ చంద్ర పిలుపునిచ్చారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మరియు సీబీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "స్వచ్ఛోత్సవ్%-%2025" కార్యక్రమంలో ఆయన విశ్వవిద్యాలయానికి చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. రమేశ్ చంద్ర మాట్లాడుతూ, స్వచ్ఛత హీ సేవా 2.0 కార్యక్రమంలో మహిళలకు నాయకత్వ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఇందువల్ల శానిటేషన్ కార్యక్రమాలు మరింత ఫలప్రదంగా సాగడమే కాకుండా, సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో, ఘన వ్యర్థాల ఆర్థిక వ్యవస్థలో మహిళలకు అవకాశాలు లభించడంలో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవా 2025 దేశంలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, మహిళల భద్రత, పరిశుభ్రత మరియు శానిటరీ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని రమేశ్ చంద్ర పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ శక్తి, స్వస్థ నారీ శశక్త పరివార్ వంటి పలు కేంద్ర ప్రభుత్వ పథకాలు స్వచ్ఛ భారత్ అభియాన్ తో అనుసంధానమై, దేశంలోని మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని ఆయన వివరించారు. గత దశాబ్ద కాలంలో స్వచ్ఛ భారత్ అమలుతో దేశంలో పారిశుధ్య మౌలిక సదుపాయాలు, మహిళల భద్రత, పరిశుభ్రత గణనీయంగా మెరుగుపడ్డాయని ఆయన అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఐ.వి. లలిత మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో స్వచ్ఛత ప్రమాణాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రజల్లో అవగాహన పెంచడంలో ముందుండి పనిచేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛత హీ సేవా అంశంపై నిర్వహించిన ఎలోక్యూషన్ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు పి. మాధవి, యువశ్రీ, వి. ఉమా మరియు సీబీసీ అధికారి పి. హరి కృష్ణ పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో రైతన్నల గుండెల్లో భయం



**తిరువూరు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు బంగాళాఖాతం ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తిరువూరు నియోజకవర్గ పరిధిలో ఇస్తారంగా కురుస్తున్న వర్షాల వలన రైతుల గుండెల్లో భయం ఇప్పుడిప్పుడే రైతు పొలాల్లో పంటను కోసి రోడ్లపై ఆరబోస్తుండగా అకాల వర్షాలు రావటంతో ఆరబోసిన ధాన్యం తడిసి పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు ఆరు గాళాలు రాత్రి పగలు కష్టపడి పండించిన పంట రైతు కళ్ళముందే తడిసిపోతుంటే ఏమీ చేయలేని దుస్థితిలో రైతన్నలు ఉన్నారు ఈ సంవత్సరం అధిక వర్షపాతంతో పొలాలకు ఎక్కువ పెట్టుబడి పెట్టి నష్టపోతున్న రైతులకు భారీ తుఫాను కారణంగా కోలుకోలేని ఎదురుదెబ్బ రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని పంట గిట్టుబాటు ధర ఇచ్చి రైతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు

# బెల్ట్ షాపులపై ఎన్ఫోర్స్మెంట్ దాడులు

- **పుల్లూరు గ్రామానికి చెందిన మందా పుల్లారావు వద్ద 21 మద్యం సీసాలు స్వాధీనం**



**మైలవరం,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** మైలవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లో అనధికార మద్యం విక్రయాలపై విజయవాడ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గురువారం దాడులు జరిపారు. ఈ దాడులలో మైలవరం మండలం పుల్లూరు గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న మందా పుల్లారావును ఎన్ఫోర్స్మెంట్ అధికారులు అరెస్ట్ చేసి అతని వద్ద 21 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు మైలవరం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జె.శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాల్లో మద్యం అనధికారిక విక్రయాలు జరుపరాదని,ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియ జేశారు.అధికార మద్యం విక్రయాల ద్వారానే కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నందున ప్రజలు కూడా అనధికార మద్యం విక్రయాలు (బెల్టు షాపుల) ద్వారా మద్యం కొని సేవించి, బెల్ట్ షాపుల ను ప్రోత్సహించవద్దని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# సబ్జెక్టులలో పట్టు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దండి-ఆర్ మోహన రావు

- **ఎస్సీ హాస్టల్ ను సందర్శించిన ప్రత్యేక అధికారి, ఇరిగేషన్ ఎస్ఇ మోహన రావు**






**జి.కొండూరు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** సబ్జెక్టులలో పట్టు సాధించేలా పదో తరగతి విద్యార్థులను తీర్చిదిద్దాలని స్థానిక ఎస్సీ హాస్టల్ ప్రత్యేక అధికారి,ఇరిగేషన్ ఎస్ఇ (SE) ఆర్.మోహనరావు హాస్టల్ వార్డెన్ యమ్. చంద్ర మోహన్ ను ఆదేశించారు.గురువారం సాయంత్రం ఇరిగేషన్ ఎస్ఇ మోహనరావు ఎస్సీ వసతి గృహాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన టెన్త్ విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో అర్థమయ్యేవిధంగా ఉపాధ్యాయు లు పాఠాలు బోధిస్తున్నారా? మార్కులు ఎలా వస్తున్నాయి ? అని వారిని అడిగారు.ఆయన విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని బాగా చదువుకోవాలని హాస్టల్ ప్రత్యేక అధికారి మోహన రావు విద్యార్థులకు సూచించారు. సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు.అన్ని సబ్జెక్టులపై అవగాహన కలిగి ఉండాలని, సబ్జెక్టులలో డౌట్స్ ఉంటే ట్యూటర్లను అడిగి తెలుసుకోవాలన్నారు. అనంతరం రికార్డుల ను పరిశీలిం చారు.వసతి గృహంలో ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులు మొత్తం 35 మంది ఉన్నారు. వీరిలో 7 గురు టెన్త్ విద్యార్థులు ఉన్నట్లు హాస్టల్ వార్డెన్ తెలియజేశారు.విద్యార్థులకు ఇంగ్లీషు, హిందీ గణితం, సైన్స్ సబ్జెక్టులలో పట్టు సాధించడం కోసం నలుగురు ట్యూటర్లను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

# భూరీ విరాళాలతో దేవస్థానాల జీర్ణోద్ధరణ...



**గుడ్లవల్లేరు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** భూరీ విరాళాలతో గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ దేవస్థానాల జీర్ణోద్ధరణ పనులు పరుగులు తీస్తున్నాయి. గురువారం కొసరాజు వెంకట రామకష్ణారావు, సరోజనమ్మ దంపతుల జ్ఞాపకార్ధం కుమారుడు కొసరాజు బాపయ్యచౌదరి, విజయ దంపతులు రూ.1,02,232, స్థానిక ఆర్యవైశ్య సంఘం వారు రూ.3,06,942 విరాళాలను అందించారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్ వల్లభనేని బుడ్డిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగెళ్ల నాగేశ్వరరావు, కాగితం ఆదినారాయణ, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గా అంగర రంగనాథ్



**పెడన,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గా అంగర రంగనాథ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ఎక్స్ ఆఫీసియో సెక్రటరీ ఎస్ సత్యనారాయణ ఉత్తర్వులు జరీచేసారు. శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సూచన మేరకు ఈ నియామకం జరిగింది. పెడన నియోజకవర్గం బంటుమిల్లి కి చెందిన రంగనాథ్ న్యాయవాద వృత్తిలో ఉన్నారు. టిడిపిలో క్రియాశీల నాయకునిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మండల టిడిపి అధ్యక్ష పదవి కోసం పోటీ పడ్డారు. రంగనాథ్ డైరెక్టర్ పదవిలో రెండు సంవత్సరాల పాటు కొనసాగుతారు.

# పశ్చిమ గోదావరి జిల్లా ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్‌గా పులిచెర్ల రవి కిరణ్




**ఏలూరు,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఆదేశాల మేరకు రాష్ట్ర ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ శౌంఠి నాగరాజు పశ్చిమ గోదావరి జిల్లా ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్‌గా పులిచెర్ల రవి కిరణ్ ని నియమించినట్లు గురువారం ఉక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పచ్చిమ గోదావరి జిల్లాలో ఓబీసీ కాంగ్రెస్ శక్తిని మరింతగా అభివృద్ధి చేయడానికి ప్రతి గ్రామం ప్రతి మండలం ప్రతి నియోజకవర్గంలో ఓబీసీ కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేసి, కాంగ్రెస్ పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడానికి జిల్లా అధ్యక్షులు హరికుమార్ రాజా నాయకత్వం లో కృషి చేయాలని సూచించారు. అలాగే షర్మిల రెడ్డి పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేయాలని రవి కిరణ్ ని ఆదేశించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులు చేపట్టే దిశగా ఎదగాలని శుభాకాంక్షలు తెలిపారు.

# వండువ ఇనాం భూముల రైతుల్ని అన్నదాత సుఖీభవ జాబితాలో చేర్చండి

- **జాబితా సవరించి న్యాయం చేయాలి**
- **మన్యం జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



**విజయవాడ,అక్టోబరు 23 (వార్తాప్రభ) :** ఇనాం భూములు, డీకేటీ పట్టాలు ఉన్న రైతులకు కూడా అన్నదాతా సుఖీభవ వర్తింప చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా రాష్ట్రంలో ప్రతి రైతుకీ సాయం అందాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. పార్వతీపురం మన్యం జిల్లా, వీరఘట్టం మండలం, వండువ గ్రామ పరిధిలో ఇనాం భూములు సాగు చేసుకుంటున్న రైతులకు అన్నదాతా సుఖీభవ పథకం వర్తించేలా తక్షణం చర్యలు తీసుకోవాలని ఆ జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. వండువ గ్రామ పరిధిలో 653 మంది రైతులు ఇనాం భూములు సాగు చేసుకుంటుండగా, వారికి అన్నదాతా సుఖీభవ సాయం అందలేదు. ఈ విషయాన్ని పాలకొండ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ గురువారం సాయంత్రం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వ్యవహారంపై తక్షణం స్పందించిన పవన్ కళ్యాణ్ సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# సిఎస్ విజయనంద్ తో భేటీ అయిన నీతి ఆయోగ్ సిఇఓ

(మొదటిపేజీ తరువాయి)



వ్యవసాయం, మత్స్య సంపద వంటి రంగాల్లో విలువ జోడింపును ప్రోత్సహిస్తుంది. సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహిస్తుంది మరియు భారతదేశం అంతటా ఆర్థిక అసమానతలను తగ్గిస్తుంది. మెరుగైన కనెక్టివిటీ మరియు పారిశ్రామిక సామర్థ్యం తూర్పు రాష్ట్రాలను ఎగుమతులు మరియు స్థిరమైన ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రాలుగా ఉంచుతాయి. అదే విధంగా తూర్పు భారతదేశంలో స్థిరమైన అభివృద్ధి వైపు పూర్వోదయ ఒక ముఖ్యమైన ముందడుగా చెప్పవచ్చును.సమానమైన వృద్ధిని సృష్టించడం మరియు తూర్పు భారత దేశాన్ని శక్తివంతమైన ఆర్థిక శక్తి కేంద్రంగా మార్చడంలో కీలకపాత్ర పోషిస్తుంది.మౌలిక సదుపాయాలు,విద్య మరియు ఆర్థిక సాధికారతలో కొనసాగుతున్న పెట్టుబడులతో 2047 నాటికి వికసిత్ భారత్ అనగా అభివృద్ధి చెందిన భారతదేశంగా మారే ప్రయాణంలో పూర్వోదయ పథకం తూర్పు తీర ప్రాంతంలో ఒక కీలక పాత్ర పోషించనుంది. ఈస మావేశంలో నీతి ఆయోగ్ అదనపు సిఇఓ పార్థసారధి రెడ్డి,రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికల శాఖల ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్,విద్యాశాఖ కార్య దర్శి కె.శశిధర్,ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్ చంద్,ప్రణాళికాశాక జెఎ స్ అనంత శంకర్,నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండి జి.గణేశ్ కుమార్ పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188